# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా

ఫోన్ (0863) 2293645, 2293862, 2293206.

web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com



**సంపాదక వర్గము**

మిస్. పి. ఇందిరాదేవి

డా॥ యమ్. స్వర్ణముఖి

సి.వి. రమణ బాబు

పి.యస్.ఆర్.కె. ప్రసాద్

కె. మురళీ మోహన వర్మ



సంపుటి 40 సంచిక 10
పేజీలు 44
జూన్ 2021

5సం॥ల చందా రూ. 250

2సం॥ల చందా రూ. 120

సంవత్సర చందా రూ. 60

విడిప్రతి వెల...... రూ. 5

బ్యాంక్ డ్రాఫ్టు Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్, A/C సమర్థ సద్గురు ,పేరుతో డ్రా చేయండి. M.O, బ్యాంక్ డ్రాఫ్టు పంపవలసిన చిరునామా
మేనేజరు
సమర్థ సద్గురు మాగజైన్
శ్రీకాళీగార్డెన్స్ - 522508, నంబూరు
గుంటూరు జిల్లా

Printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor PALURI SIVA RAMA KALI PRASAD


**ఈ సంచికలో** ............................ ....... **పేజీ**


దాశరథీ శతకము ........................................ 4

శ్రీబాబూజీ ఉవాచ........................................ 5

అమ్మమాట........................................ 8

తత్త్వమసి ........................................ 10

అగస్త్య హృదయం ........................ ..............13

గురుకృప ........................ ..............................15

మంత్రోపదేశం ........... .................... ...................17

రామాయణంలో స్త్రీ పాత్రలు......................19

దైవ సహాయం................. ................... ................21

బాబూజీతో అనుభవాలు ..............................25

మదాలస ............................ ...........................26

కాల జ్ఞానం ...... .. ........................ ........................28

ప్రథమ దర్శనం ..................... ...........................30

కైవల్యోపనిషత్ ... ..............................................32

శ్రీకాళీగార్డెన్స్ కార్యక్రమాలు...........................34

శ్రీబాబు దివ్యవాణి ..............................................35

హరరాయ్.................. .......... ..................................37

సమర్థ సద్గురునాథుని దివ్యచరిత్ర.....39

విష్ణు కథలు ....... ........................... ...................41

## దాశరథీ శతకము - భద్రాచల రామదాసు

11) **శ్రీ రఘువంశ తోయధికి శీతమయూఖుడవైన నీ పవి**
**త్రోరుపదాబ్జముల్ వికసితోత్పల చంపక వృత్తమాధురీ**
**పూరితవాక్ప్రసూనముల బూజలొనర్చెద జిత్తగింపుమీ**
**తారకనామ భద్రగిరి దాశరథీ కరుణాపయోనిధీ!**

భావం - రఘువంశమునకు చంద్రుని వంటివాడవు, అట్టి నీ చరణములను ఉత్పలము, చంపకము మొదలగు పద్యవృత్తములను పూలచే పూజించెదను. నా పూజలను గైకొనుము దాశరథీ! కరుణాపయోనిధీ!




నరకాసురుని అంతరేంద్రియాలు ఎందుకు స్తంబించాయి?
అన్ని గ్రహాల ప్రభావాన్ని నిర్వహించే రంగు ఏది?
ఏ భావన వున్నంత వరకూ ధ్యానం కుదరదు?
అశ్వతరుణుడు శారదామాతను ఏ వరాలు కోరుకున్నాడు?
ఆత్మను గురించి ప్రబోధించే విషయంలో దేవతలు ఎవరూ ప్రస్తావన లోకి రాక కేవలం గురువుగారే ఎందుకు వస్తారు?
మనం 'దేహము నేను' అనే భావనలో ఎందుకు కూరుకు పోయాము?
భగవంతుని సేవకు సదా ఏమి కలిగి వుండాలి?
సినిమా పాటల్లో కూడా పవిత్రతను గ్రహించాలంటే ఎటువంటి మనస్సు కావాలి?

***సమాధానాలు లోపలి పేజీలలో............................***

# శ్రీబాబూజీ ఉవాచ

- కీ.శే. పరాశర ప్రసాద్

7-11-1980

ఈరోజు దీపావళి పండుగ. శ్రీ లలితానంద సరస్వతిగారు నరకాసుర వధను గూర్చి చెపుతూ, నరకాసురుని సంహరించటానికి దేవతల ప్రార్థనను మన్నించి శ్రీ కృష్ణ పరమాత్ముడు సత్యభామా సమేతుడై గరుడ వాహనారూఢుడై బయలుదేరి వెళ్ళాడు. యుద్ధరంగంలో శ్రీకృష్ణ పరమాత్ముడు పూరించిన పాంచజన్యాన్ని నరకాసురుడు విని, శరీరం కంపించి శ్రీకృష్ణుని కమనీయ ఆకృతి చూసి వెల్లకిల పడ్డాడు అని చెప్పారు.



అప్పుడు బాబూజీ కల్పించుకొని ఈ పండితులతో వచ్చిన తిప్పలు ఇవే మరి. నరకాసురుడు పడలేదు. శ్రీకృష్ణ పరమాత్ముని కమనీయ ఆకృతి దర్శించి నిశ్చేష్టుడైనాడు. శ్రీకృష్ణుడు నీలమేఘ శ్యాముడు. నల్లని ఆకృతి, పద్మములవంటి కండ్లు గల ఆ పరమాత్ముని చూసిన నరకాసురుని అంతరేంద్రియాలు స్తంభించాయి.

శ్రీకృష్ణ పరమాత్ముడు ఆ నరకాసురునిచూసి ఒక చిరునగవు చిందిస్తాడు. ఆ చిరునగవు నరకాసురునిలోని సమస్త సంకటములను హరిస్తుంది. నరకునిలోని అహంకారము హరిస్తుంది. కర్ణేంద్రియాలు శబ్దాన్ని వినలేవు. చక్షువులు దృష్టిని ఆయనపైననే నిలుపుతాయి. ఇక బాహ్యస్మృతి లేదు. అదే ఏకాగ్రదృష్టి.

దీనిని తిలకించిన సత్యభామకు ఏమిటి ఈ వైపరీత్యము? ఈ రాక్షసుడు యుద్ధము చేయకుండానే చనిపోయాడా? అన్న సందేహము కలుగుతుంది. ఆ పరమాత్ముని కమనీయ ఆకృతి అటువంటిది. ఆఁ! మరచి పోయాను. పాపం మీకు అడ్డువచ్చాను చెప్పండి, చెప్పండి" అని శ్రీ లలితానంద సరస్వతిగారిని హెచ్చరించారు శ్రీ బాబూజీ.

'మీరు చెపుతున్నారుగా, ఇంక నేను చెప్పేది ఏమి ఉంది?'

అన్నారు ఆవిడ.

"మీరు పండితులు. సకల శాస్త్రములను సాంగోపాంగముగా చదివినవారు. మీ ముందు వీడెంత? ఏదో అమ్మ పలికిస్తే చెప్పానుగాని, తూ నాబొడ్డు నేనేం చదువుకోలేదు" అన్నారు శ్రీ బాబు.

శ్రీకృష్ణ పరమాత్ముడు నీలమేఘశ్యాముడు. నీలివర్ణము కలిగిన మేఘము చల్లదనాన్నిస్తుంది. అది వర్షించి క్షేత్రములు సస్యశ్యామలమై సమస్త జీవకోటిని ఆనందమయం చేస్తాయి. అటువంటి మేఘములను సహితం ప్రకాశింపచేసే శ్రీకృష్ణ పరమాత్మ తన చూపుతో ఇంకెంత చల్లదనాన్నిస్తాడు? ఆయన చిరునగవు ఎంత ఆహ్లాదాన్ని కలగజేస్తుంది?

నీలివర్ణపు రాయిని ఇంద్రనీలము అంటారు. ఆ ఇంద్రనీలాన్ని శనిగ్రహ ప్రభావాన్ని నివారించటానికి వాడమంటాయి శాస్త్రాలు. అయితే నీలమేఘశ్యాముని నీలము, ఒక శనిగ్రహాన్నే కాదు అన్ని గ్రహాల ప్రభావాన్ని నిరోధిస్తుంది. ఈ నవగ్రహాల ప్రభావంకన్న ప్రమాదభరితమైన నవగ్రహాలు కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలు, సత్త్వ, రజస్తమో గుణాలు. వీటిని సైతం హరింపజేస్తుంది. నీలమేఘశ్యాముని అనుగ్రహం లేకపోతే నవగ్రహాలు సైతం గతులు తప్పి ప్రళయానికి దారితీస్తుంది.

కాబట్టి అట్టి నీలమేఘశ్యాముని పాదపద్మములపై మనస్సు నిలిపి భక్తి విశ్వాసాలను పెంపొందించుకోవాలి. కానీ, మనము అట్టి పరమాత్ముని ప్రార్థించి అల్పమైన కోరికలు కోరతాం. శాశ్వతానందాన్ని ఇస్తాను, అది జన్మరాహిత్యాన్ని కలుగజేస్తుంది అంటున్నాడు శ్రీ కృష్ణ పరమాత్మ.

కాని మనము అల్పమైన కోరికలను కోరి వాటిని పొందలేక అసలు పరమాత్మ ఉన్నాడా? అని శంకించి, కొంతమంది ఆ భగవంతుని పటములను సైతం పగులకొడతారు. మనం కోలిన కోర్కెలన్నీ సఫలీకృతం కాకపోవటం పరమాత్ముని తప్పా? విలువైన మణులు ఇస్తానన్న మహారాజును పాతగుడ్డలు ఇవ్వమని కోరినట్లుంది మనం భగవంతుని మేడలు, మిద్దెలు కోరుకోవటం.

మనము పరమాత్ముని పాదపద్మములపై మనస్సు నిలిపి శాశ్వతానందాన్ని పొందినట్లయితే ఆయనే అన్నీ చేకూరుస్తాడు. మనము ఆయన పుత్రులమైన తర్వాత ఆయన తన నిధిని ఇక ఎవరికి ఇస్తాడు?

తండ్రి తన ఆస్తిని తన పుత్రునికి గాక ఎవరికి ఇస్తాడు? పుత్రుడు

తండ్రి ఆస్తిని తనకు ఇవ్వమని అడగాలా? తారకం తన కొడుకుకి కాలేజీలో సీటు కావాలని అడిగాడా? అడగలేదు. నేను శ్రీ బాబూజీని అడగను, కావాలంటే నువ్వే అడుగు అని అన్నాడు.

నేను చెప్పేది అసత్యం కాదు. కావాలంటే అడగండి" అన్నారు శ్రీ బాబు. "ఏమయ్యా తారకం? నేను చెప్పేదాంట్లో ఏమన్నా అసత్యం వుందా?" 'లేదు బాబూ' అని ఆయన సమాధానం యిచ్చాడు.

తారకం అడగకుండానే గురుదేవుడు సీటు ప్రసాదించాడు. అట్టి కరుణామయుడు ఈ నీలమేఘశ్యాముడు అని తనవైపు వేలు చూపించి, వీడు కాదు వాడు అని శ్రీ బాబూజీ గదివద్దనున్న కృష్ణపరమాత్మ ఫొటోవంక చూపించారు.

మనలో కోరికలు లేకుండా సంపూర్ణ విశ్వాసంతో భగవంతుణ్ణి ప్రార్థించినట్లయితే మనలోనున్న సంకటములు, సంకల్పములు, జన్మాంతర వాసనలు హరించి అంతరింద్రియాలు శుద్ధిచెంది సత్యము, శాంతి, దయ, ప్రేమగా మారి శాశ్వతానందాన్ని కలుగజేస్తాయి.

పోతనామాత్యుడు భాగవతాన్ని రచించాడు. అంత మహాగ్రంథాన్ని ఎవరైనా పాడుచేస్తారేమో? దాన్ని కాపాడటం ఎలాగా? అని పోతనామాత్యుని పుత్రునికి అనుమానం వచ్చి తండ్రిని ప్రశ్నిస్తాడు.

దానికి "కుమారా! నాచే ఈ భాగవతాన్ని వ్రాయించిన ఆ పరమాత్ముడే కాపాడుకుంటాడు. దానిని కాపాడటానికి మనము ఏ ప్రయత్నమూ చేయనవసరంలేదు అంటాడు పోతనామాత్యుడు" అన్నారు శ్రీబాబు.

## శ్రద్ధాంజలి

శ్రీబాబు చిరకాల భక్తులు, ఆశ్రమ స్థిర నివాసులు అయిన ముక్తినూతలపాటి మైత్రా వరుణ్ 15-5-2021 శనివారం నాడు శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 35 సంవత్సరాలు. సద్గురుదేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరు గాక! వీరి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాము.

# అమ్మమాట

- జపమాల ప్రసాద

## ధ్యానమనేది డైరెక్టు సేవ

ఏ ఆత్మ వస్తువు గురించి మనం ఇంత విచారణ చేస్తున్నామో, వెదుకుతున్నామో, అది మనం అయ్యే వున్నాం. ఏదో ఒక సామ్యం చెప్పాలి కాబట్టి, భ్రమర కీటక న్యాయం అని చెప్పారు గానీ, మనం గొంగళి పురుగు ఎందుకు అవుతాం? అనేకానేక జన్మాంతర వాసనలు, గుణాలు మన హృదయం నిండా పెట్టుకోవడమే గొంగళీపురుగు సామ్యం. కానీ, గురుమూర్తి మనను ఈ ఆశ్రమమనే గూడులో పెట్టి, నిరంతరం మనచేత గురుబోధని శ్రవణం చేయిస్తూ, మనన నిదిధ్యాసలు చేయిస్తూ, మన నిజ స్వరూపాన్ని మనం గుర్తించేటట్లు మన చేత సాధన చేయిస్తున్నారు. ఎవరంతట వారు గుర్తిస్తే తప్ప, గుర్తింపు అనేది రాదు. మార్పు రాదు. ఈ గుర్తింపు, మార్పు మనలో రావాలంటే, గురుముద్ర మనకి కావాలి. అదే లక్ష్యార్థము. ఆ లక్ష్యార్థ సాధన ద్వారానే మన నిజ స్వరూపం మనం తెలుసుకో గలుగుతాం. అందుకే ధ్యానమనేది డైరెక్టు సేవ.



మనలోని గుణాలను, వాసనలను దగ్ధం చేయడానికి ఈ ధ్యానాగ్ని ఒక్కటే చేయగలదు. దోషం మనలో పెట్టుకుని, దానిని ఇంకొకరు ఎత్తి చూపితే రోషం వస్తోంది. ఇటువంటి మానసిక దోషాలను మనం వదిలించుకోవాలి. 'నేను ఫలానా' అని అనుకుంటున్నంత వరకూ అంటే దేహాత్మ భావన వున్నంత వరకూ ధ్యానం కుదరదు. ధ్యానానికి కూర్చునేటప్పుడే, 'స్వామీ! ఈ దేహంలో వున్నది నువ్వే. దీనిని ప్రకాశింప జేసేది నువ్వే' అని కూర్చుంటే ఇక మనసు నిలవక ఏం చేస్తుంది? 'నీ వనచు నీవైతినే' అని పాడుకున్నాం. ఇక్కడ ఏకమే కానీ, బహుళ సంఖ్య లేదు. రెండు లేవు. ఒక్కటే వున్నది. 'నిను చూచి - నీవైతినే' - చూసి చూసి, తలచి తలచి, ఆ తద్వస్తువే నీవయి పోతున్నావు.

ఒక వీసెడు పటిక బెల్లం తింటే ఒళ్ళంతా తీపి అయిపోయింది

అంటాం. కానీ, మనస్సు పరమాత్మ భావనతో మధురమైపోతే, సర్వ సృష్టి మధురంగానే వుంటుంది. రాధ, గోపికలు, సూరదాసు ఇత్యాది భక్తులు అటువంటి స్థితిలో నిత్యమూ ఓలలాడారు. వెదకి వెదకి చూద్దామన్నా వారిలో ఈర్ష్య, అసూయ, అసహనం, ఓర్వలేనితనం ఇత్యాది గుణాలు కనిపిస్తాయా? పరమాత్మ గుణగణాలనే నిత్యమూ కీర్తిస్తూ వుంటే మనస్సు ఆ పరమాత్మ రూపాన్నే పొందుతుంది. మనలోని నీచ గుణాలను తొలగించి, మనలో మార్పు తేవడానికి గురుదేవులు కష్టపడుతున్నారు. మనకాయన తత్వబోధను వెన్నతో పెట్టినట్లు పెడుతున్నారు. మానవ దృష్టి గురుదృష్టికి మారాలి. 'నేను బ్రహ్మను' అనుకుంటే చాలదు. ఆ బ్రహ్మానుభూతిని అనుభవించి తీరాల్సిందే. అదే 'ధ్యాన ప్రక్రియ'.

నీదంటూ ఏదైనా వుంచుకున్నావో, బంధనకి గురవుతావు. పాట పాడినంతసేపే ఆ భావన వుంటే చాలదు. ఆ భావనలో శాశ్వతంగా నిలిచిపోవాలి. అదే 'భావ సమాధి'.

మనస్సును ముందుగా శుద్ధి చేసుకోవలసినదే. మన దోషాన్ని మనం గుర్తించడం కూడా మనకు తెలియడం లేదు. ఇతరుల దోషాలను వెదుకుతున్నాం, కానీ, మన దోషాన్ని మనం గుర్తించేటంతవరకూ సాధన చేసి తీరవలసినదే. అసలు నీ అంత్యశ్వాస వరకూ సాధన చేయవలసినదే. నీ మనస్సు సంస్కరింపబడాలి. దాని కోసమే మహాత్ములు తమ జీవితాలను ధారపోశారు. వారు చెప్పింది మనం తు.చ. తప్పకుండా ఆచరించి, వారు పొందిన బ్రహ్మానందాన్ని మనం కూడా పొందిననాడే వారు ఆనందిస్తారు. అదొక్కటే వారి ఆశ. అలా చేసిన నాడే గురు ఋణం తీర్చుకున్న వాళ్లం మనం అవుతాం.

**గురువరా నీ చరణము వీడక**
**గురువరా నీ స్మరణను మానక**
**నిరంతరం నిలవాలి**
**నా హృదంతరం అలయాలి**

అన్నదే మన ప్రార్థన అవ్వాలి. అట్టి అఖండ భక్తి, జ్ఞాన, వైరాగ్యములను ప్రసాదించి, గురుపాదుకలు సర్వదా కాపాడు గాక! సుఖీభవ! సుఖీభవ!!

(గత సంచిక తరువాయి)

# తత్త్వమసి

- సుషుమ్నా ప్రసాద

రూపనామములు మార్పుతో కూడినవి. వాటికి శాశ్వతత్వము లేదు. అందుచేతనే **బ్రహ్మ సత్యము జగన్మిథ్య** అన్నారు. అంటే బ్రహ్మ ఒక్కటే సత్యము, నిత్యము, పరిణామ రహితము అయినది. కానీ అది ఆపాదించుకొన్న రూప నామములన్నీ మిథ్య. అంటే సత్య రహితమైనవి, మార్పు చెందుతూనే వుంటాయి. జగత్తు అంటేనే జనించేది, గతించేది అని అర్థం. ఏ సత్వదార్థమైన ఆత్మ నుండి జగత్తు నిర్మాణమైనదో ఆ ఆత్మ అత్యంత సూక్ష్మం. అంటే అవ్యక్తం. ఈ నామ రూపాత్మకమైన జగత్తు నశించినా, ఆ సత్య రూపాత్మకమైన ఆత్మ ఎన్నటికీ నశించదు. సూక్ష్మాతి సూక్ష్మం కాబట్టే **అణోరణీయాన్ మహతో మహీయాన్** అన్నారు. అందుచేత ఈ ఆత్మ కంటికి కనిపించదు. ఓ శ్వేతకేతూ! ఇది తెలియజేసే సత్యమే 'తత్త్వమసి' అదే నీవు. ఆత్మవై వున్నావు. ఉన్నది ఒక్కటే.

ఇదంతా విని శ్వేతకేతువు తండ్రితో ఇలా అన్నాడు 'తండ్రీ! మీరీ మూలతత్త్వమును **అణోరణీయాన్** అంటే పరమాణువు కన్న సూక్ష్మమై, అగోచరమైన దానిచేత ఆకాశము, భూమి, జలము, అగ్ని, వాయువు అనే పంచభూతముల చేత అత్యున్నత శిఖరాలు గల హిమాలయములు ఎత్తైన వృక్షాలు, నదులూ, సముద్రాలు ఇలాంటి స్థూలాతిస్థూల పదార్థములన్నీ ఎలా వుత్పన్నమవుతున్నాయి? మీరు చెప్పిన పరిభాషతో కార్యము గోచరిస్తున్నది. కాని కారణం అగోచరము. నాకు సంపూర్ణంగా అవగాహన కాని ఈ సిద్ధాంతమును గురించి చక్కగా వివరించ'మని తండ్రిని ప్రార్థించాడు.

ఉద్దాలకుడు కుమారుని యొక్క జిజ్ఞాస, ఆసక్తి, బుద్ధి కుశలతను చూసి ఆనందంతో మరల ఇలా వివరించాడు. అక్కడ ఉన్న పెద్ద మర్రి వృక్షం నుండి ఒక మర్రి పండు తెమ్మనమన్నాడు శ్వేతకేతువును. తెచ్చాక దానిని ముక్కలుగా కోయమన్నాడు. శ్వేతకేతువు తండ్రి ఆజ్ఞ ప్రకారం పండును కోశాడు. కోసిన తరువాత అందులో ఏమున్నదని ప్రశ్నించాడు. దానిలో అణువులాంటి చిన్నచిన్న విత్తనములు వున్నాయని చెప్పాడు శ్వేతకేతు. అందులోని ఒక విత్తనమును తీసి చితక్కొట్టమన్నాడు. దానిలో ఏమి కనిపిస్తోందని అడిగాడు. ఏమీ కనబడటం లేదు అని

శ్వేతకేతువు బదులిచ్చాడు.

ఉద్దాలకుడు మాట్లాడుతూ 'అవ్యక్తమైన ఆ విత్తనపు అణువు నుండి విస్తారమైన ఈ మహావృక్షము వుత్పన్నమైనట్లే అణోరణీయము, సత్యము, అవ్యక్తమైన ఆత్మతత్త్వము నుండి బృహత్తరమైన సృష్టి ఈ జగత్తు వుత్పన్న మైనది కాబట్టి అసత్యస్వరూపవే. కాబట్టి అన్నిటికీ ఆధారభూతమైన సత్యమే నీవు. అదే తత్త్వమసి' అని వివరించాడు. ఈ వివరణలో శ్వేతకేతుకు ఈ చరాచర జగత్తుకు ఆధారభూతమైనది, బ్రహ్మమాత్రమేనని విశ్వాసం కలిగింది. కాని మరికొన్ని సందేహాలు వుండటంతో వాటి నివారణకై తండ్రిని ఇలా ప్రశ్నించాడు.

'ఓ తండ్రీ! అతి సూక్ష్మమైన ఈ సత్త్వదార్థము అగోచరము, కంటికి కనపడనిది కావడంలో ఆశ్చర్యం లేదు. కాని ఇది సర్వవ్యాపకం ఎలా కాగలదు?' అని అడిగాడు.

అప్పుడు ఉద్దాలకుడు ఒక పాత్రను తెప్పించి, దానిని నీటితో నింపించాడు. కొంత ఉప్పు తెమ్మన్నాడు. ఆ ఉప్పును ఆ నీటిలో వేయమన్నాడు. ఆ తరువాత వారిద్దరూ నిద్రకు ఉపక్రమించారు. తిరిగి ప్రాతఃకాలంలో కాలకృత్యాలు తీర్చుకున్న తరువాత శ్వేతకేతునితో నీవు రాత్రి నీటిలో వేసిన ఉప్పును బయటకు తీయమన్నాడు.  ఉప్పు నీటిలో కలిసిపోయి దాని ఆకారము కోల్పోయింది అన్నాడు శ్వేతకేతువు. అప్పుడు ఉద్దాలకుడు ఆ నీటిని తీసుకుని త్రాగమన్నాడు. ఎలా ఉంది అని అడిగాడు. నీరు చాలా ఉప్పగా వున్నాయి అని చెప్పాడు శ్వేతకేతువు. ఆ తరువాత ఉద్దాలకుడు శ్వేతకేతును ఆ పాత్రలోని పైభాగం నుండి, మధ్య భాగం నుండి, క్రింది భాగం నుండి వరుసగా మూడుసార్లు నీరు తీసుకుని త్రాగమని ఎలా వున్నాయి అని అడిగాడు. ఎటునుండి త్రాగినా ఉప్పగానే వున్నాయన్నాడు శ్వేతకేతువు.

'నాయనా! నీవు స్వయంగా తెల్లగా కణములుగా వున్న ఉప్పును తీసి నీటిలో కలిపావు. కానీ ఇప్పుడు ఆ ఉప్పు అదృశ్యమైంది. కంటికి కనిపించడం లేదు. కానీ, ఆ ఉప్పు నీటిలో సర్వత్రా వ్యాపించి వున్నదని చెప్పడానికి  పాత్రలోని జలమంతా ఉప్పగా వుంది. దీనిని బట్టి నువ్వు గ్రహించవలసినదేమంటే లవణం అదృశ్యమైనా లవణ లక్షణం నీటిలో అంతటా వ్యాపించినట్లు; పరమాత్మ అగోచరమైనా ఆత్మ ప్రభావము సర్వే

సర్వత్రా వ్యాపించి వుంటుంది. దీనిని బట్టి చర్మచక్షువులకు అగోచరమైన పరమాత్మ సర్వ చరాచర జగత్తుకు ఆధారభూతము. ఆ పరమాత్మయే నీవై వున్నావని గ్రహించు. అదే 'తత్త్వమసి' మహావాక్యాన్ని తెలియజేస్తుంది. తత్ - ఆ పరమాత్మయే త్వం - నీవు, అసి - అయివున్నావు.

అలా అనేకత్వంలో ఏకత్వమును, పరమాత్మ సర్వవ్యాపకత్వమును గ్రహించడమే అనుభవపూర్వకంగా ఆచరించడమే **తత్త్వమసి**. అలా కూలంకషంగా శ్వేతకేతువు పరమాత్మ తత్త్వాన్ని గ్రహించి తరించాడు. అలా తెలుసుకున్న వాడే మహాజ్ఞాని. ఆ తరువాత దాని మనన, నిదిధ్యాసల చేత శ్వేతకేతువునకు ఆనందానుభూతి కలిగింది. (ఛాందోగ్యోపనిషత్ ఆధారంగా ............)

## సమర్థ సద్గురు మాస పత్రిక సభ్యులకు విజ్ఞప్తి

ఈ క్రింద తెలిపిన సభ్యుల మాస పత్రిక చందా జూన్, జులై 2021 మాసాలలో ముగుస్తుంది. పత్రిక నిలిపివేసే ముందుగా మీ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకొనండి.

***జూన్ 2021 :*** AS 7247, 7279, 7280, 8140, 8539

***జులై 2021 :*** AS 3728, 5930, 6405, 8149

## ***పెదనింద్రకొలను శాఖలో కార్యక్రమాలు***

*** ప్రతి గురువారము అన్నార్తులకు, సాధువులకు అన్నదానం జరుగును***

**జూన్ 2021**

4 శుక్ర - శ్రీగురుదశమి, శ్రీహనుమజ్జయంతి, శ్రీసద్గురు పాదపూజ, భక్తసమారాధన

24 గురు - జ్యేష్ఠ పూర్ణిమ - శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

**జులై 2021**

4 ఆది - శ్రీగురుదశమి - శ్రీసద్గురుపాదపూజ

20 మంగళ - తొలిఏకాదశి - శ్రీ సద్గురుపాదపూజ

24 శని - (ఆషాఢ) గురు పూర్ణిమ - శ్రీ సద్గురు పాదపూజ.

# అగస్త్య హృదయం

(గత సంచిక తరువాయి)

- వారణాసి కాళీప్రసాద్ U.S.A

**ఆదిత్య హృదయం పుణ్యం సర్వ శత్రు వినాశనమ్**
**జయావహం జపేన్నిత్యం అక్షయ్యం పరమం శివమ్ ॥**
**సర్వ మంగళ మాంగల్యం సర్వ పాప ప్రణాశనమ్**
**చింతాశోక ప్రశమనమ్ ఆయుర్వర్ధన ముత్తమమ్ ॥**

**తాత్పర్యము** - ఆదత్య హృదయమను ఈ స్తోత్రం పరమ పవిత్రము, మరియు పుణ్యకరమైనది. దీనిని నిత్యం జపిస్తే సర్వ శత్రువులను నశింప జేసి, జయమును, శాంతిని, శుభమును చేకూరుస్తుంది. శ్రేష్ఠమైన ఈ స్తోత్ర రాజము సకల మంగళకరమై, సర్వ పాపములను నశింపజేసి, చింతాశోకములను తొలగించి, ఆయుష్షును వృద్ధిపరుస్తుంది.

ఈ శ్లోకములోనే ఈ స్తోత్రము 'ఆదిత్య హృదయము'గా అగస్త్యుల వారితో సంబోధింపబడింది. పరిశీలిస్తే, ఈ రెండు శ్లోకములు కలిసి ఆదిత్య హృదయము యొక్క ఫలశృతి లాగా కనిపిస్తూ, పఠించిన వారికి పైన వివరించినట్లు శత్రువులపై విజయంతోపాటు సర్వ మంగళములు చేకూరుతాయని తెలియజేస్తున్నాయి. కానీ, ఆదిత్య హృదయం చివరలో 25వ శ్లోకం మొదలుకొని (**ఏనమాపత్సు కృచ్ఛ్రేషు...**) ఫలశృతి చెప్పబడింది. కాబట్టి ఈ రెండు శ్లోకములలో తప్పకుండా రహస్యమైన విషయాలు దాగి వుండాలి.

ఆదిత్య హృదయమును గురువు ప్రసాదించిన ఉపదేశ మంత్రంగా పరిగణిస్తే ఈ శ్లోకములను లక్ష్యార్థమును ప్రసాదించే ముందు గురువు శిష్యునకు చేసే ముఖ్య సూచనగా గమనించాలి. శ్రీ బాబూజీ మహరాజ్ గురు లక్ష్యార్థము శిష్యుని జీవితంలో అత్యంత విశేషమని, లక్ష్యార్థ స్వీకరణ తరువాత సాధకుడు ద్విజుడు (రెండవ జన్మనెత్తిన వాడు)గా పిలువబడతాడని శలవిచ్చారు. లక్ష్యార్థమును స్వీకరించేటప్పుడు శిష్యునకు వుండవలసిన భక్తి శ్రద్ధలు మరియు సంపూర్ణ శరణాగతి గురించి శ్రీబాబు ఎన్నోమార్లు వారి బోధలలో ప్రస్తావించారు. అదే విధంగా ఆదిత్యహృదయమును శ్రీరామునికి ఉపదేశించడానికి ఉపక్రమిస్తూ అగస్త్యులు అది సర్వశత్రు వినాశకరమని, లక్ష్యసిద్ధివైపు మళ్ళించి అక్షయము, పరమమైన శుభాన్ని చేకూర్చగలదని వివరిస్తున్నారు.

**సర్వశత్రు వినాశనమ్** అన్న ప్రయోగాన్ని **సర్వానలీన్**గా ముందు వివరింపబడిన అంతశ్శత్రు బాహ్యశత్రువులని, అరిషడ్వర్గములను

నశింపజేసే లక్ష్యార్థంగా గమనించాలి. శ్రీబాబూజీ అరిషడ్వర్గములైన, కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాదులలో కనీసం ఒక్కటైనా గురుదేవునికి సమర్పించుకుంటే అది క్రమేపీ మిగతావాటిపై కూడా విజయానికి దారి తీస్తుంది అని బోధించారు.

**జపేన్నిత్యం** అన్న ప్రస్తావన లక్ష్యార్థమును సాధకుడు నిరంతరం జపించాలని గుర్తుచేస్తోంది. ఇదే విషయాన్ని వివరిస్తూ శ్రీబాబు భగవన్నామాన్ని తైలధారవలె జపించాలని, ఒకచేతిని భగవానుని పాదములపై వుంచి, మరొక చేత్తో వ్యావహారికమైన పనులను ముగించుకుని, తిరిగి ఆ చేతిని కూడా పాదములపైకి చేర్చాలని, అప్పుడది నిష్కామ కర్మకు దారితీస్తుందని తెలిపారు. మనం అలా చేయగలగడమే **జపేన్నిత్యం** అన్న సూచనకు సార్థకత.

**చింతాశోక ప్రశమనం** అన్న విశేషణం గురూపదేశము చింతను, శోకమును నిర్మూలించడమే కాక, వాటికి కారణమైన భవసాగరమును దాటించగలదని తెలియజేస్తోంది. ఇది **చింతయాస్థితమ్**గా మొదటి శ్లోకంలో వివరింపబడిన శ్రీరాముని స్థితినే కాక, ఐహిక పరమైన అనేక చింతలతో కూడిన మానవ జీవితమును సూచిస్తోంది. శ్రీకృష్ణ పరమాత్మ సాంఖ్య యోగములో అర్జునుడితో **నత్వం శోచితుమర్హసి** అంటూ నీ స్వధర్మమును ఆచరించడమే నీ కర్తవ్యం తప్ప శోకించడం తగదు అని బోధించాడు. శ్రీబాబు మనందరినీ 'నీవు సహజముగా ఆనంద స్వరూపుడవై వున్నావు, దానిని గుర్తించు' అని లక్ష్యార్థ సిద్ధివైపు నడిపిస్తున్నారు.

మరి ఆనాడు **నత్వం శోచితుమర్హసి** అన్న జగద్గురువులకు, తాము బ్రహ్మానందములో ఓలలాడుతూ, మనందరినీ అటు నడిపిస్తూ, **ఆనంద నిలయాయ నమః** అన్న సార్థక నామధేయంతో విరాజిల్లుతున్న మన సద్గురుదేవులకు అభేదము కదా!

శ్రీబాబూజీ గురుబోధా శ్రవణము, సత్సంగము నిత్యకాలంలో జమ అవుతాయని బోధించేవారు. ఆ నిత్యకాలమునే సాధకుడి నిజమైన ఆయుష్షుగా పరిగణించాలి. **ఆయుర్వర్ధనముత్తమమ్** అన్న ప్రస్తావనను లక్ష్యార్థ సాధనతో నిత్యకాలమును పెంచుకోమన్న గురుదేవుల సూచనగా గుర్తించాలి. ఈ విధంగా ఉపదేశ సమయంలో లక్ష్యార్థ సిద్ధికి గురువు శిష్యునకు అందించే రహస్యములు ఈ శ్లోకములలో దాగి వున్నాయి.

- సశేషం

(గత సంచిక తరువాయి)

# గురుకృప

- పెనుమాక నాగేశ్వరరావు

"అమ్మా సిగిరెట్లు నా అంతట నేను మానుకోలేను క్షమించండి. మీరు మానిపిస్తే ధన్యుడిని" అన్నాను మాటలు కూడదీసుకుని. మౌనంగా నా వంక చూశారు. రేపు నవరాత్రులకి రా అన్నారు. అలాగేనంటూ తల వూపాను. మరి కొంత సేపు వుండి తిరుగు ప్రయాణం అయ్యాము.

వారం రోజుల లోపే నేను ధూమపానం మానేశాను. అందులో నా ప్రమేయం ఏమీ లేదు. అంతా అమ్మ దయ. ఆనాటి నుంచి ఇక ఆ జోలికి పోనే లేదు. అసలు ఆ ఆసక్తే లేదు. అమ్మకు మరోసారి కృతజ్ఞతలు తెలియచేసుకుంటున్నాను.

ప్రసాదంతో కడుపు నింపి ప్రసంగంతో మనసు నింపి ప్రసన్నంగా చిరునవ్వు నవ్వి ప్రమోదంగా పలుకరించే అమ్మా చంద్ర కాళీ ప్రసాద అమ్మా అని ఓ గేయం లో వ్రాసుకున్న అక్షర సత్యాలు.

2015 శ్రీ బాబూజీ ఆరాధనల సమయంలో మా అమ్మకు అనారోగ్యం కలిగింది. పెరాలసిస్ వచ్చింది. హాస్పిటల్‌లో కొన్ని రోజులు వైద్యం అయ్యాక ఇంటికి వచ్చింది. ఆశ్రమానికి వచ్చి బాబూజీ, మాతాజీ దర్శనం చేయించాలని ఆమెను తీసుకుని ఆశ్రమానికి రావటం జరిగింది. సాయంత్రం ప్రార్థన జరుగుతున్న సమయం. మాతాజీ కూడా బృందావనం లో వున్నారు. అమ్మను చక్రాల కుర్చీలో తీసుకు వచ్చాం. మాతాజీ స్వయంగా బాబూజీ పాదుకలు మా అమ్మ శిరసు మీద వుంచి ఆమె చేత నమస్కారం పెట్టించి ఆశీర్వదించటమే కాకుండా అమ్మ ఆరోగ్య పరిస్థితి అలా వుంటే నేనే మీ ఇంటికి వచ్చేదాన్ని కదా అన్న ప్రేమ స్వరూపిణి శ్రీ మాతాజీ. మేమందరం కూడా నమస్కారాలు చేసుకుని మా అమ్మని తీసుకుని గుంటూరు చేరాము. అదో మధురానుభూతి.

2018 జూన్ నెలలో అనారోగ్య కారణంగా నేను హాస్పిటల్‌లో చేరాను. రెండు రోజులు గడిస్తేనే కానీ ఏమీ చెప్పలేమన్నారు డాక్టర్లు. చేరిన రోజు రాత్రే వెంటిలేటర్ అమర్చారు. వారం రోజులకు పైగా కోమాలోనే వున్నాను. మాతాజీకి కబురు వెళ్ళింది. ఆశ్రమంలో అభిషేకాలు జరుపుతున్నారు. మరో నాలుగు రోజులకు నాకు స్పృహ వచ్చింది. ఓ రోజు ఆసుపత్రిలో నా బెడ్ పక్కనే మాతాజీ త్రిశూలం ధరించి, జడ విరబోసుకుని

నాట్యం చేస్తున్న దృశ్యం నేను చాలాసేపు దర్శించుకున్నాను. కాళీమాత, కాళీబాబు అనే నామం అప్రయత్నంగానే మననం కాసాగింది. అప్పటినుంచి నేను పూర్తి స్పృహ లోకి వచ్చి మాట్లాడటం మొదలుపెట్టాను. కోలుకుని ఇంటికి చేరాను. అమ్మ దయ ఆ రకంగా నన్ను కాపాడింది. ఇది నా జీవితంలో మరో మరపురాని సంఘటన. మరువలేని అనుభవం.

**అమ్మంటే అమ్మా కాదు, ఆమ్మంటే ఆమ్మాకాదు**
**అవ్యాజ ప్రేమతో  అల్లుకున్న అనుబంధం మాది**
**అభిమానంతో పెంచుకున్న అనుబంధం మాది**
**భక్తి భావంతో పెనవేసుకున్న బంధుత్వం మాది**
**భవబంధం కాని బంధం మాది, భగవత్సంబంధం మాది**

**శ్రీబాబూజీ మహారాజ్‌వారి ఆశయాలకు అనుగుణంగా ఏర్పాటు కాబడిన మన ఆశ్రమ హాస్పిటల్ (శ్రీశ్రీశ్రీ హనుమత్ కాళీ వర ప్రసాద బాబు ట్రస్ట్ హాస్పిటల్)లో నిత్యం ఎంతో మందికి కన్సల్టేషన్ ఫీజు (సంప్రదింపుల రుసుము) లేకుండా వైద్యసేవలు అందిస్తున్నారు. అంతేకాకుండా అవసరార్థులకు ఉచితముగా కాన్పులు చేయడం కూడా జరుగుతోంది. ఈ కార్యక్రమములు అన్నీ భక్తుల యొక్క సహాయ సహకారములతో నిర్వహింపబడుతున్నాయి. ఈ నెలలో ఉచితముగా కాన్పులు చేయబడినవారిలో ఇద్దరి ఫోటోలు:**



(గత సంచిక తరువాయి)

# మంత్రోపదేశం

- ఎన్. కుట్టీ

కొద్దిరోజులు గడిచాయి. రోజులు గడుస్తున్న కొద్దీ రంగనాధుడికి ఆశ్రమజీవితం కష్టంగా తోచింది. రోజూ తెల్లవారుజామున లేవడం, నదికి వెళ్ళి చన్నీళ్ళు స్నానం చేయడం, వారు పెట్టింది మాత్రమే తినడం, అనేక సేవా కార్యక్రమాలు చేయడం ...... ఇలా ఇదంతా పెట్టింది తిని, చెప్పినది విని, చచ్చినట్లు పడుండటం అనేది దుర్భరంగా అనిపించింది. కానీ అతను మనస్సులో మాట ఎవరితోనూ చెప్పుకోలేదు. ఆశ్రమం వదలి వెళ్ళనూ లేదు. నిరంతరం మనస్సులో మాత్రం ఈ ఉచ్చు నుండి ఎప్పుడు బయట పడతానా! హాయిగా నా పెళ్ళాం బిడ్డలతో నా ఇంట్లో ఎప్పుడు సుఖంగా వుంటానా! అనవసరంగా భార్యతో తగువులాడి ఇక్కడకు వచ్చి ఇరుక్కుపోయాను' అని మనస్సులో మధనపడుతూ వుండేవాడు. అలాగే కొన్ని సంవత్సరాలు గడిచిపోయాయి.

ఒకరోజు ఆశ్రమంలో గురువుగారు కొంతమంది శిష్యులకు మంత్రోపదేశం చేయడం చూశాడు. వాళ్ళందరినీ ఏమిటదని అడిగితే ఎవ్వరూ చెప్పలేదు. ఆ గురువుగారినే అడగమన్నారు. రంగనాధుడికి వాళ్ళకు ఆయన ఏమని ఉపదేశించాడో తెలుసుకోవాలనే ఆతృత పెరిగిపోయింది. నేరుగా గురువుగారి దగ్గరకు వెళ్ళి 'స్వామీ! మీరు అందరికీ మంత్రదీక్ష ఇస్తున్నారు కదా! నాకు కూడా ఆ మంత్రాన్ని ఉపదేశించండి' అని అడిగాడు. భరద్వాజస్వామి రంగనాధుడితో 'నాయనా! నీవు దీక్ష ఇస్తే చేయలేవేమో!' అన్నారు. 'నేను చేస్తాను. నాకూ మంత్రం ఇవ్వండి' అని అడిగాడు. స్వామి 'నాయనా! నీకు నా మీదనే సరిగా నమ్మకం లేదు కదా! ఇహ నేను ఇచ్చే మంత్రం మీద మాత్రం ఏం నమ్మకం వుంటుంది?' అన్నారు. అయినా సరే రంగనాధుడు 'స్వామీ! నేను తప్పక చేయగలను దీక్ష నాకూ ఇవ్వండి' అన్నాడు. అప్పుడు గురువుగారు 'సరే! పౌర్ణమి నాడు ఉదయం 3గం. లేచి నదీస్నానం చేసి, పట్టు బట్టలు కట్టుకుని నా దగ్గరకు రా' అన్నారు.

రంగడు గురువుగారు చెప్పినట్లే పౌర్ణమి నాడు స్నానంచేసి, పట్టుబట్టలు కట్టుకుని ఠంచనుగా ఆయన చెప్పిన సమయానికి హాజరయ్యాడు. గురువుగారు రంగనాధుడి చెవిలో 'ఓం నమో నారాయణాయ' అనే మహా మంత్రాన్ని ఉపదేశించి, నాయనా! ఇది చాలా గొప్ప మంత్రం. మహా మహిమాన్వితమైనది. దీనిని ఇంతవరకూ ఎవరికీ చెప్పలేదు. నీకే చెప్పాను. దీనిని శ్రద్ధతో జపించు. నీవు మాత్రం

దీన్ని ఎవరికీ చెప్పకూడదు. చెప్పావా నీవు కష్టాల పాలవుతావు జాగ్రత్త!' అని హెచ్చరించారు.

రంగడు ఆయన చెప్పిన ప్రకారం రోజూ జపం చేశాడు. అలా కొన్ని సంవత్సరాలు గడిచిపోయాయి. కానీ ఏమీ ప్రయోజనం కనబడలేదు. 'ఈ మంత్రం ఎందుకు తీసుకున్నానురా భగవంతుడా! ఏ మార్పూ లేదు నా జీవితంలో, ఇదేమి గురువుగారు రా భగవంతుడా!' అని అనుకుంటూ వుండేవాడు మనస్సులో.

ఒకరోజు గురవుగారు రంగడిని పిలిచి, 'రంగా! ఈ రోజు నువ్వు గ్రామంలోకి వెళ్ళి, ఇంటింటికి తిరిగి మధుకరి తెచ్చి, దానితో పరమాన్నం ప్రసాదం వండాలి' అని ఆజ్ఞాపించారు. రంగడి గుండెల్లో రాయి పడింది. 'అబ్బా! ఇంటింటికి తిరిగి బిచ్చమెత్తుకు రావాలా! ఇదెక్కడి ఖర్మరా బాబూ!' అని బాధ పడుతూ ఎదురు చెప్పలేక, ఏమీ చెయ్యలేక చివరికి మధుకరికి బయలుదేరాడు.

- సశేషం

**సమర్థ సద్గురు మాసపత్రిక మరింతమంది పాఠకులకు చేరువ కావాలనే ఉత్తమ ఆశయంతో ఆంధ్ర రాష్ట్రంలోని 100 గ్రంథాలయాలకు, 5 సంవత్సరాలు పత్రికను ఉచితంగా అందించడానికి తుని వాస్తవ్యులు శ్రీ కంచెర్ల జగదీష్, సుభద్ర దంపతులు 25,000 రూపాయలు విరాళంగా సమర్పించారు. వారికి, వారి కుటుంబ సభ్యులకు ఆయురారోగ్య ఐశ్వర్యాలను ప్రసాదించాలని శ్రీగురుదేవులను ప్రార్థిస్తున్నాము.**

## శ్రద్ధాంజలి

శ్రీబాబు చిరకాల భక్తులు శ్రీమతి పోగుల అనసూయమ్మగారు 22-5-2021 శనివారం నాడు శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 92 సంవత్సరాలు. సద్గురుదేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరు గాక! వీరి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాము.

# రామాయణంలో స్త్రీ పాత్రలు

-సుషమ్మా ప్రసాద

# మండోదరి

మండోదరి రావణాసురుడి పట్టమహిషి. రావణాసురుని సతీ బృందమందరిలో విశిష్ఠత, ప్రత్యేకత కలిగిన మహాసాధ్వి. నిత్యమూ ఎవరిని స్మరించి, ధ్యానిస్తే సకల పాతకములు నశిస్తాయని నిర్దేశించిందో అట్టి పంచకన్యలలో మండోదరి ఒకరు. అహల్య, సీత, తార, మండోదరి, ద్రౌపది - ఈ అయిదుగురు సాధ్వీమతల్లులు 'పంచ కన్యలు'గా కీర్తింపబడ్డారు. ఇందులో మొదటి నలుగురు రామాయణంలో దర్శనమిస్తారు. ద్రౌపది మహాభారతంలో సాక్షాత్కరిస్తుంది. ఈ పంచ కన్యలలో సీత, ద్రౌపది ఇద్దరు మహాతల్లులు అయోనిజలు. వివాహితులైన స్త్రీలు కన్యలుగా కీర్తింపబడ్డారంటే అది వారి పవిత్రత, ఔన్నత్యములకు తార్కాణము. మండోదరి మహాసాధ్వి, మహాపతివ్రత.

మండోదరి మహాతపస్వియైన మయునకు, హేమ అనే అప్సరస స్త్రీకి జన్మించిన మహాసాధ్వి. మయుడు బ్రహ్మదేవుని వరం వలన కుబేరుని సంపదను పొందారు. హేమ స్వయంప్రభ స్నేహితురాలు. మండోదరి సార్థక నామధేయురాలు. మండోదరి అంటే అందమైన ఉదరము కలది అని అర్థము. అంటే ఎలాంటి క్లిష్టమైన విషయమైన పదిలంగా ఉదరంలో (కడుపులో) దాచుకుని, గుంభనంగా వుండేది.

వాల్మీకి మహర్షి రామాయణంలో రెండసార్లు మాత్రమే మనకు మండోదరి ద్యోతకమయ్యేటట్లు చేస్తారు. మనకు ఒక నానుడి వుంది 'చూడండి! అన్నం ఎలా వుడికిందో తెలుసుకోవాలంటే మెతుకు ఒక్కటి పట్టుకుంటే చాలు' అంటారు. అలాగే మండోదరి విశిష్టత, సాత్విక స్వభావము, ఔన్నత్యము తెలుసుకోవడానికి ఈ రెండు సంఘటనలు చాలు. మొదటిసారి మనకు మండోదరిని సుందరకాండలో పరిచయం చేస్తారు. రెండవసారి రావణాసురుని వధ అనంతరము యుద్ధరంగంలో విగతజీవుడైన రావణాసురుని వద్దకు వచ్చి రోదిస్తున్న మండోదరిని చూస్తాము. సౌందర్యంతో విరాజిల్లే మండోదరిని, ఆ సుందరికి తగినట్లుగా సుందరకాండలో పరిచయం చేస్తారు. సీతాన్వేషణ నిమిత్తమై లంకానగరం చేరుకుని, రావణాంతఃపురంలోకి ప్రవేశించి, శయనమందిరంలోకి వస్తాడు హనుమంతుడు. అక్కడ రావణుని

ప్రియకాంతలంతా తివాసీలపై, విభునితో క్రీడించి, మత్తుగా త్రాగి, అస్తవ్యస్తమైన వస్త్రాలు, మిలమిల మెరిసే ఆభరణాలతో పడుకుని వుంటారు. వారిని పరికించి చూసి, వీరెవరినీ సీతమ్మతో పోల్చకూడదని, అమ్మ దర్శనార్థమై చింతిస్తూ ముందుకు సాగాడు. అక్కడ కొంత దూరంలో రత్నవైఢూర్యములను పొదిగి, ముత్యాల సరాలు వేలాడుతున్న పాన్పుమీద దివ్యకాంతులతో వెలిగిపోతూ, దివ్యాభరణ భూషితయైన ఒక నిరుపమాన సౌందర్యవతియై వీరందరికీ విలక్షణంగా, ప్రశాంతంగా, నిద్రిస్తున్న మండోదరిని చూసి హనుమంతుడు ఒక తృటికాలం సీతమ్మ అని భ్రమించి, సీతమ్మ కనబడినది అనే ఆనందంతో ఎగిరి గంతేసి, కపిచేష్టలన్నీ చేశాడు. కానీ, వెంటనే హనుమంతుడు తన్నుతాను సంబాళించుకుని, రామచంద్రుని విరహవేదనతో తపిస్తున్న సీతమ్మ తల్లి ఆ శయన మందిరంలో అంత ప్రశాంతంగా ఎలా నిద్రించగలదు? అది అసంభవము అని తలచి, తన్ను తాను నిందించుకున్నాడు. అంటే సాక్షాత్తు ఆంజనేయస్వామినే తృటికాలం సీతామహాసాధ్వి ఏమో! అని భ్రమింపజేయగల దివ్యాంగన, పవిత్రమూర్తి మండోదరి.

రావణుడు వేలాదిమంది స్త్రీల మధ్య మదగజంలా పవళించి వుంటే, అతనికి అత్యంత ప్రియురాలు, పట్టమహిషి అయిన సౌందర్యరాశి మండోదరి అదే గదిలో దూరంగా శయనించి వుండటం మండోదరి పవిత్రతకు, పాతివ్రత్యమునకు సంకేతం. మండోదరి పవిత్రతకు, పాతివ్రత్యానికి సీతమ్మతల్లికి దీటైనదైనా, ఆమె రావణాసురుని అర్ధాంగి అవడం వలన మరుగున పడిపోయింది.

**న కులేన, న రూపేణ, న దాక్షిణ్యేన మైథిలీ**
**మయాధికా వా తుల్యా వా తత్వం మోహాన్నబుధ్యసే**

మండోదరి తనను గురించి తాను సగర్వంగా, యుద్ధభూమిలో భర్త శవంపై పడి ఏడ్చి, చెప్పుకున్న మాటలివి. కులంచేతగాని, రూపంచేతగాని, దాక్షిణ్యంలోగాని సీత నాకంటె అధికురాలు కాదు. కాని, మోహంలో కూరుకు పోయిన నీకు (రావణునికి) ఆ విషయం అర్థం కాలేదు - అని శోకించింది. ఈ మాటలు మండోదరి తన వ్యక్తిత్వం గురించి సగర్వంగా, ధర్మబద్ధంగా చెప్పుకున్న మాటగాని, స్వాతిశయమునకు దర్పణం కాదు.

- సశేషం


దైవ సహాయం
మధుప
అమ్మో! రేపు చాలా
కష్టమైన పరీక్ష
ఉంది. ఎంతో
రాత్రైనా కష్టపడి
చదవాలి.
1


నిన్న ఈ ప్రశ్నకు
జవాబు నాలుగు
సార్లు చదివాను.
అయినా గుర్తు
రావట్లేదే!
స్వామీ
ఆంజనేయా! ఇక
నువ్వే దిక్కు.
2


ఆ గుర్తు వచ్చింది! ధన్యవాదాలు స్వామీ!


అయ్యో! కారు బురదలో దిగిపోయిందే. ఆంజనేయా! నాకు సహాయం చెయ్యి స్వామీ!


ఆంజనేయా! ఎన్నిసార్లు పిలిచినా రావేమిటి స్వామీ?
5


ఇక లాభంలేదు. నేనే ఈ కారుని తోస్తాను!
6


హమ్మయ్య! ఆ దేవుని దయవల్ల మొత్తానికి కారు బయటకు వచ్చింది!
7


చూశారా పిల్లలూ! ముందుగా మీ పని మీరు చేసి ఆ తరువాత భగవంతుని ప్రార్థిస్తే ఆయన తప్పక సహాయం చేస్తాడు. అంతేకానీ పని చేయటానికి బద్ధకించి కేవలం దేవునిపైనే భారం వేస్తే ఆయన సహాయానికి రాడు.
8

# బాబూజీ తో అనుభవాలు

(గత సంచిక తరువాయి) -వి. లక్ష్మీ నరసమాంబ

దానితో చికాకులు మొదలయ్యాయి. కోడలి తల్లిదండ్రులు ఉత్తరాదివారు. వారి ఆహారపు అలవాట్లు, ఆ పిల్లల పెంపకం మనకు భిన్నంగా వుంటాయి. వాళ్ళు పసిపిల్లకు చన్నీళ్ళు పోయాలి అంటారు. చన్నీళ్ళ స్నానం చేయిస్తే ముందు బిడ్డకు జలుబు చేసినా, తరువాత తీవ్రమైన ఢిల్లీ చలిని కూడా తట్టుకోగలరు అన్నది వారి అభిప్రాయం. వారు దానిని పాటిస్తారు కూడా. కానీ ఈ బాబుకి చలి పడదు. వేడి ప్రదేశం అయిన ఔరంగాబాద్‌లో పుట్టి, వేడినీళ్ళు పోసుకుని, 5నెలలు పెరిగాడు. వాడికి చల్లని నీళ్ళు పోయగానే జలుపు చేసి ఎంతకీ తగ్గలేదు. ఇక యాంటిబయాటిక్స్ వాడవలసినదే అని డాక్టర్లు చెబితే, నేను వేడినీరు పోయించడం మొదలు పెట్టాను. జలుబు వెంటనే తగ్గిపోయింది. పిల్లవాడు ఆరోగ్యంగా పెరుగుతున్నాడు.

అంతేకాదు, పిల్లలను రఫ్ అండ్ టఫ్‌గా పెంచాలి అప్పుడే వారు ఆటుపోటులు తట్టుకోగలుగుతారు అని వారి ఉద్దేశం! పిల్లలు చీటికిమాటికి అనారోగ్యం పాలుకాకూడదని అప్పుడే తల్లి ఆఫీస్‌కి వెళ్ళి ప్రశాంతంగా పని చేసుకోగలుగుతుందని నా ఉద్దేశం. ఇలా అభిప్రాయాలు వేరువేరుగా వుండటంతో వాడు చీటికిమాటికీ రోగాల బారిన పడటం, మందులు వేసి నేను తగ్గించడం జరుగుతోంది. ఇలాంటి చిరాకులతోనే పిల్లవాడు 4సంవత్సరాలు పెరిగాడు. దానితో వాడి పెంపకం నాకొక పెద్ద సమస్యగా మారింది. ఆ అమ్మాయి పిల్లవాడి ఆరోగ్య విషయంలో జాగ్రత్తగా వుండాలని బాబుగారిని గట్టిగా ప్రార్థించాను. రోజూ ఉదయమే సహస్ర నామాలు చదవడం ప్రారంభించాను. 40రోజులు పారాయణ చేసేసరికి ఆ అమ్మాయి మనస్సు మారాలి అని వేడుకున్నాను.

40రోజులు పారాయణ పూర్తి అయ్యేసరికి కోడలిలో మార్పు ఆరంభమైంది. నేను మాటిమాటికి ఆరోగ్య సూత్రాలు వల్లెవేయడం మానేసరికి, ఆ అమ్మాయే స్వయంగా పిల్లవాడి ఆహార, స్నానపానాదులలో జాగ్రత్త తీసుకోవడం మొదలు పెట్టింది. ముందు వాడికి చన్నీళ్ళు పోయడం మానివేసింది. ఆమెకు ఆమే వాడిని ఆరోగ్యంగా వుంచడం ఒక సవాలుగా తీసుకుంది. అంతే! నా ప్రమేయం లేకుండా కుర్రవాడు ఆరోగ్యంగా పెరుగుతున్నాడు. -సశేషం

# మదాలస

- రావి శోభ

మోక్షసాధనే మానవుడి జీవితానికి పరమార్థమని జోలపాట రూపంలో పాడి, తన పిల్లలను చిన్నతనం లోనే పరమాత్మ చింతన అనే తపస్సు ద్వారా పునీతులను చేసిన గొప్ప యోగీశ్వరి అయిన మదాలస గంధర్వ కాంత. **ఋతుధ్వజుడనే** మహారాజును వివాహం చేసుకుంది. ఋతుధ్వజుడు **కువలయాశ్వము** అనే గుఱ్ఱంపై విహరిస్తూ వుంటాడు కాబట్టి ఆయనకు **కువలయాశ్వనుడు** అనే మరో పేరు కూడా వున్నది. ఋతుధ్వజుడు ధర్మబద్ధంగా రాజ్య పాలన చేస్తూ, మదాలసతో కలసి సుఖసంతోషాలతో జీవిస్తున్నాడు.

ఇలా ఉండగా ఒక రోజు మదాలస ఉద్యానవనంలో విహరిస్తూ ఒక రాక్షసుని వలన మరణిస్తుంది. ధైర్యవంతుడైన ఋతుధ్వజుడు మదాలస మరణంతో ఎంతో క్రుంగిపోయాడు. తనలో ఎప్పుడూ ధైర్యాన్ని నింపే మదాలస కోసం విలపించసాగాడు. ఇలా రాజమందిరం అంతా శోకసముద్రంలో మునిగి వుండగా ఇద్దరు పిల్లలు మహారాజైన ఋతుధ్వజుని వద్దకు వచ్చారు. ఆ పిల్లలిద్దరూ చూడటానికి ఎంతో ముద్దుగా, వారి పలుకులు ధర్మబద్ధంగా, ఆచరణ యోగ్యంగా వున్నాయి. మహారాజును ఓదార్చడానికి వచ్చిన ఆ పిల్లల రాకతో మహారాజులో చిన్నగా మార్పు రాసాగింది. ఆ పిల్లలిద్దరూ ప్రొద్దుటే వచ్చి, రాత్రి వరకు వుండి, రాత్రి అయ్యేసరికి వారు మహారాజు వద్ద శలవు తీసుకుని వెళ్ళిపోయేవారు. ఈ విధంగా ఒకసారి రాత్రి వరకు వున్న ఆ పిల్లలు తిరిగి వెళ్ళ బోతుండగా ఋతుధ్వజుడు వారిని సాగనంపడానికి వారితోపాటుగా, వారు ఎప్పుడూ చెప్పే తటాకం దాకా వెడతాడు. అప్పుడు ఆ చిన్న పిల్లలు తటాకం దగ్గర తమ తమ నాగరూపాలను ధరించి కనిపిస్తారు. వారిని అలా చూస్తున్న ఋతుధ్వజునికి వారు నడుమ క్రింది భాగం అంతా పాము రూపం, నడుము పై భాగం మానవ రూపంతో, మేలిమి బంగారు ఛాయతో దేదీప్యమానంగా వెలిగిపోతూ, చిరుమందహాసంతో, ప్రసన్న నేత్రాలతో, రత్నాలు పొదిగిన కిరీటాలను ధరించి, అద్భుతమైన తేజస్సుతో కనిపిస్తున్నారు. వారిని ఆ రూపాలలో

చూడటంతో ఋతుధ్వజుడు ఆశ్చర్యపోతూ, కొద్ది క్షణాలు కళ్ళార్పకుండా చూస్తుండిపోయాడు.

కొద్దిసేపటికి తేరుకుని 'ఎవరు మీరు? ఎవరి పిల్లలు?' అని అడుగుతున్న ఋతుధ్వజునితో ఆ పిల్లలు 'మేము నాగలోక అధిపతి అయిన అశ్వతరుణుని పిల్లలము. మళ్ళీ ప్రొద్దున్నే కలుద్దాం మిత్రమా' అంటూ ఆ తటాకంలో మునుగుతున్న వారిని సంభ్రమాశ్చర్యాలతో ఆరాధనగా చూడసాగాడు. తిరిగి రాజమందిరానికి వచ్చిన ఆ మహారాజు తన మనస్సులో 'తన బాధని తీర్చడానికే అన్నట్లుగా తనకి మంచి స్నేహితులను ఇచ్చాడా భగవానుడు అని నేను ఇన్నాళ్ళూ భావించాను. కానీ సాక్షాత్తు ఆ పరంధాముని తల్పమైన ఆదిశేషుని వారసులే తనకు ఇంతకాలం ఇంత ధైర్యాన్ని ఇస్తున్నదని ఇప్పుడే తెలిసింది' అనుకున్నాడు.

ఒకసారి నాగలోకంలో ఈ నాగకుమారులిద్దరూ తన తండ్రియైన అశ్వతరుణుడి దగ్గరకు వెళ్ళి, 'తండ్రీ! మీ వలన మేము ఒక ఉపకారం పొందాలని వచ్చాము. ఈ పని మీ వలనే సాధ్యపడుతుందనే గట్టి నమ్మకం మాకున్నది' అని చెప్పి, తమ స్నేహితుని బాధను తండ్రికి చెప్పారు. అంతా విన్న అశ్వతరుణుడు మాట్లాడుతూ 'అంతా బాగానే వున్నది. ఇప్పుడు ఆ మదాలసను తిరిగి తీసుకురావాలి. ఏ రూపంలో, ఏ యవ్వనంలో మరణించిందో, అదే రూపంలో తీసుకురావాలంటే అది ఎలా సాధ్యపడుతుంది?' అని ఆలోచిస్తుండగా మీరే సాధించగలరు ఈ పనిని అంటూ పిల్లలిద్దరూ పట్టుపట్టారు.

అప్పుడు వింధ్య పర్వతం దగ్గర శారదామాత కోసం తపస్సు చేయగా అమ్మ ప్రత్యక్షమై వరాలు కోరుకోమనగా అశ్వతరుణుడు వినయంగా చేతులు జోడించి అమ్మకి నమస్కరిస్తూ 'అమ్మా! నాకు రెండు వరాలు కావాలి. 1.సామవేదంలో నేను ఎవరినైనా ఓడించగలగాలి, 2. మదాలస నాకు కూతురుగా, గొప్ప యోగీశ్వరిగా పుట్టాలి' అంటూ వరాలు కోరుకున్న నాగలోకాధిపతితో అయితే ఈ సామవేదాన్ని నటరాజస్వామి వద్ద పాడి, ఆ మదాలస అభీష్టాన్ని నెరవేర్చుకో. నీ కోరిక తప్పక తీరుతుంది' అంటూ దీవించింది వాగ్దేవి.

*తరువాయి భాగం 29వ పేజీలో చూడండి..................*

(గత సంచిక తరువాయి) # కాలజ్ఞానం -పాలూరి కాళీప్రసాద్

అంతేకాదు, మనం ఒక వ్యక్తిని వ్యక్తిగానే చూస్తాం. అంటే ముందు ఒక శరీరాన్ని, దాని యొక్క రంగును, రూపురేఖలను, వేషభాషలను చూస్తాం. ఇంకొంచెం ఎక్కువ పరిచయం వున్న వాళ్ళనయితే వాళ్ళ మానసిక స్వభావాన్ని బట్టి చూస్తాం. అంతేగానీ, ఆయా శరీరాలను, మనసులను దాటి సర్వత్రా ప్రకాశించే ఆత్మవస్తువును చూడటం మనకు చేతకాదు. కానీ గురువుల, మహాత్ముల దృష్టి ఎల్లప్పుడూ ఆత్మవస్తువు మీదనే వుంటుంది. అటువంటప్పుడు ఈ పైకి కనిపించే భేదాలుగానీ, వారి దృష్టికి మాత్రమే కనిపించే త్రికాలాల యందలి చర్యలు, భావనలుగానీ అట్టి మహాత్ములపై ఎట్టి ప్రభావాన్నీ చూపలేవు. ఆయా దేహాలను, మనసులను వారు ఆ ఆత్మ ధరించే ఆచ్ఛాదనలగానే చూస్తారుగాని వాటిని ఆ ఆత్మకు ఆపాదించరు.

ఉదాహరణకు మీరు ఒక పెళ్ళి బంతిలో పప్పు వడ్డన చేస్తున్నారు అనుకోండి. ఎవరో మిమ్మల్ని 'ఓయ్ పప్పూ! ఇలా రా!' అంటే మీరు వెంటనే వెళ్ళి వడ్డిస్తారా? లేకపోతే 'వీడెవడు నన్ను పప్పూ అని పిలుస్తాడు' అని వాళ్ళతో గొడవ పడతారా? ఖచ్చితంగా మొదటి మార్గాన్నే ఎంచుకుంటారు కదా! ఎందుకంటే ఇక్కడ రెండు విషయాలు మీకు స్పష్టంగా తెలుసు. మొదటిది అతను పప్పూ అని పిలిచినది మీరు కేవలం పప్పు బక్కెట్టు పట్టుకున్న వ్యక్తి అనే ఉద్దేశంతోనే కానీ, మీరేదో తెలివితేటలు లేనివారని కాదు. రెండవది మీరు కేవలం పప్పును పట్టుకున్నారే కానీ దాని గుణగణాలతో, లక్షణాలతో మీకు ఎటువంటి సంబంధం లేదు. అలాగే ఈ శరీరాన్ని, మనస్సును, ఆత్మ పట్టుకుని నడిపిస్తోంది. కానీ దీని గుణగణాలతో రూపనామాలతో దానికి ఎట్టి సంబంధం లేదు.

మరి ఈ జ్ఞానాన్ని నిత్యం అనుభవిస్తూ వున్న మహాత్ములకు ఆయా శరీరాల, మనసుల గుణగణాలతో, రూపనామాలతో పని ఏముంది? వారు ఎవరితో ఏమి మాట్లాడినా, ఎవరికి ఏమి చేసినా అక్కడ అంతా ఏకత్వమే కానీ రెండో భావనకు చోటు లేదు.

ఎదుటివారికి దురద వచ్చి మిమ్మల్ని గోకమంటే అది కాలిమీదా, లేక తలమీదా అని ఉచ్ఛనీచాలు ఆలోచిస్తారు కానీ మీ కాలికి దురదవస్తే

మీ చేయి అలా ఆలోచిస్తుందా? నేను ఉన్నతమైన తలమీద అయితేనే గోకుతాను కానీ నీచమైన ప్రదేశంలో గోకను అంటుందా? ఎందుకు? ఇవన్నీ మీ శరీరంలోని భాగాలే కాబట్టి అక్కడ భేదదృష్టి లేదు. అలాగే ఈ సృష్టిలో కనిపించేదంతా ఆ పరమాత్మలో భాగమే అనే దృఢమైన జ్ఞానం వున్నవారే ఎదుటివారిలోని తప్పులు, లేదా వారి భవిష్యత్తు స్పష్టంగా కనిపిస్తున్నా ఎటువంటి భేదదృష్టి లేకుండా అందరితో సమానంగా ప్రవర్తించగలరు.

***'మదాలస'....... (27వ పేజీ) తరువాయి భాగం***

అశ్వతరుణుడు హిమవత్ పర్వతం వద్ద సామవేదం పాడి నటరాజ స్వామినే మెప్పించాడు అమ్మ దీవెనతో. ప్రసన్నుడైన రుద్రుడు అశ్వతరుణుడితో నీకేం వరం కావాలో కోరుకోమనగా, త్రినేత్రుడికి చేతులు జోడించి నమస్కరించి, తన పిల్లల అభీష్టాన్ని పరమేశ్వరుని ముందు వుంచాడు. అప్పుడు పరమేశ్వరుడు 'నిష్కామ కర్మతో కూడిన నీ ఈ కోరిక తప్పక నెరవేరుతుంది. రాబోయే మీ తండ్రిగారి శ్రాద్ధకర్మలో మధ్య పిండంపై దృష్టి పెట్టి నీ మధ్య పడగతో స్వీకరించు' అని వరాన్ని ప్రసాదించాడు ఆ భోలా శంకరుడు. అలా కొద్ది కాలానికి నాగకుమారులిద్దరూ ఒక రోజు కువలయాశ్వనుడిని తమ ఇంటికి తీసుకు వెళ్ళారు. మదాలసను వుంచిన గదిలోకి తీసుకెళ్ళారు. అక్కడకు వెళ్ళిన ఋతుధ్వజునికి సరస్వతీదేవి అనుగ్రహించినట్లే యోగీశ్వరురాలిగా అగ్నిగుండం ద్వారా వచ్చిన మదాలస కనిపించింది.

తమ మిత్రులైన నాగకుమారులిద్దరి ద్వారా జరిగిన సంగతి తెలుసుకుని, అశ్వతరుణుడికి కృతజ్ఞతలు తెల్పి మదాలసను తన రాజ్యానికి తిరిగి తీసుకువచ్చి ఎంతో ఆనందంతో జీవితం గడుపుతున్నాడు. యోగీశ్వరియైన మదాలస వరుసగా విక్రాంతుడు, సుబాహువు, శత్రువర్ధనుడు, అలర్కుడనే నలుగురు పిల్లలకు జన్మనిస్తుంది. ఆవిడ గొప్ప యోగీశ్వరి కాబట్టి పిల్లలకి ఉయ్యాలలో ఉండగానే జీవిత పరమార్థాన్ని ఉగ్గుపాలుగా పోసింది. పరమాత్మ చింతన అనే తపస్సు ద్వారా వారి జీవితాలను ధన్యత అయ్యేలాగా చేసి, మనందరికీ ఆదర్శంగా నిలిచింది.

# ప్రథమ దర్శనం

- తోట అలివేలు మంగ తాయారు

2008 సం॥లో మేము విశాఖపట్టణంలో వుండేవాళ్ళం. ఆ సమయంలో ప్రతిరోజూ టి.వి ఛానల్‌లో శ్రీ మాతాజీగారి ప్రసంగం వస్తూ వుండేది. మేము రోజూ శ్రద్ధంగా వింటూ వుండేవాళ్ళం. అప్పుడు మాకు ఆశ్రమానికి రావాలని, అమ్మ దర్శనం చేసుకోవాలని అనిపించింది. కానీ, కాలగమనంలో అది మరుగున పడిపోయింది. నేను ఎప్పుడూ బాబూజీ దర్శనం చేసుకోలేదు. కానీ వారి బోధామృతంలో 'నేను కామవరపుకోట జీడిని. ఒక్కసారి పరిచయమైతే వదిలేది లేదు' అని చెప్పడం విన్నాను. అదే విధంగా మా అమ్మాయి వివాహం అయిన తరువాత ఆంధ్రా యూనివర్సిటీ నుండి నాగార్జున యూనివర్సిటీలో ఉద్యోగంలో చేరడమైనది. ఆమెతోపాటుగా మేము కూడా నాగార్జునా యూనివర్సిటీ క్వార్టర్స్‌లో వుంటున్నాము. ఇక్కడ మాకు పనిచేయడానికి ఒక అమ్మాయి వచ్చేది. ఆ అమ్మాయి కాళీగార్డెన్స్ దగ్గర వున్న కాలనీ నుండి వస్తున్నాను అని చెప్పింది. అప్పుడు మరలా మాకు ఆనాటి మాతాజీ స్మృతి పథంలోకి వచ్చారు.

అమ్మ దర్శనం చేసుకుందామని ఒక రోజు వచ్చాము. కానీ కుదరలేదు. భీమవరం భక్తులెవరో ఒకరు మమ్మల్ని ఆ మరునాడు రమ్మనమన్నారు. ఆ రోజు అమ్మను చూడగానే ఆలింగనం చేసుకున్నాను. చాలా ఆనందం కలిగింది. మరల మొన్నటి సప్తాహాలలో బృందావనంపై పుష్పాలంకారం చేసే భక్తులను అమ్మ ఆలింగనం చేసుకున్న ఫోటో సద్గురుమాస పత్రికలో చూడగానే శ్రీరామచంద్రుడు హనుమను, సుగ్రీవుని ఆలింగనం చేసుకున్న సంఘటన నా మదిలో మెదిలింది.

మరొకమారు అమ్మ దర్శనార్థమై వచ్చినప్పుడు బృందావనంలో సత్సంగం జరుగుతోంది. కొంతసేపు గడిచిన తరువాత మేము ఏదో పొలం పని వుండి ఊరు వెళ్ళాలని లేచి బయటకు వచ్చేశాము. తీరా మేము బయటకు రాగానే పని పూర్తి అయిపోయింది. మీరు రానవసరం లేదని మాకు ఫోన్ వచ్చింది. మేము వెంటనే తిరిగి లోపలికి వెళ్ళి కూర్చున్నాము. అమ్మ 'ఏమండీ నాయుడుగారూ! మీరే వచ్చారా? లేక

అమ్మను కూడా తీసుకు వచ్చారా?' అని అడిగారు.

ఒక సంవత్సరం దసరా ఉత్సవాలలో అమ్మను దర్శించుకున్నాము. ఆమెలో మాకు కాళీమాత దర్శనం అయింది. ఒకసారి మాతాజీ మా వారిని హోమం చేయించమన్నారు. కానీ కుదరలేదు. ఆ తరువాత ఆయనకు ఆపరేషను చేయించవలసి వచ్చింది. అందుకే ముందుగా హెచ్చరించారేమో అనిపించింది. తల పోవలసినది, పాగాతో పోయినట్లుగా అమ్మ వారిని రక్షించి ఆరోగ్యవంతులుగా చేశారు.

గురుమూర్తి అనేది ఒక మహత్తర శక్తి. వారు సర్వజ్ఞులు. గురుశక్తి ఏ రూపమైనా పూజనీయమే. వారికి తెలియనిది వుండదు.

**మానవుని దివ్య శక్తి**

ఎవరి శక్తి వారికి తెలియదు. కనిపించదు. మానవుని ఆత్మలో బ్రహ్మాండమైన శక్తి దాగి వున్నది. అదే దివ్య శక్తి. ఆనందం ఆత్మ స్వరూపం. ఆనందం యొక్క వెలుగే జ్ఞానం. దాని విలాసమే దివ్య శక్తి. ఈ దివ్యశక్తికి ఉద్దీపన కలిగించుకుంటున్న కొద్దీ, మానవుడు తన పాపాలను అతి సులభంగా పోగొట్టుకో గలుగుతాడు. అపకీర్తి కలుగనీయడు. దుఃఖాన్ని నివర్తించుకుంటాడు. జీవితం దివ్య శక్తిమంతం అయిపోతుంది. ఆధ్యాత్మికోన్నత శిఖరాలను అవలీలగా అధిరోహించి, అక్కడ అంతులేని ఆనందాన్ని పొందుతాడు. ఆత్మోపలబ్ధి సిద్ధిస్తుంది. పరమాత్ముని దివ్య సంకల్పాన్ని అనుసరిస్తాడు. మానవుడియందు వుండే చీకట్లు నిష్క్రమిస్తాయి. దివ్యకాంతులతో దేదీప్యమానంగా ప్రకాశిస్తాడు. ప్రపంచాన్ని అంతా తన వశం చేసుకుంటాడు. భగవంతునికి చేరువగా సాన్నిధ్య సౌఖ్యాన్ని ఆనందిస్తూ వుంటాడు. మనో నిశ్చయం, ఓర్పు, పట్టుదల వుంటే మానవునికి ఇది మిక్కిలి సులభ సాధ్యం. అప్పుడే విద్యకు అతీతమైన జ్ఞానం సంపాదించగలుగుతాడు. శుష్కతర్కాలలో చిక్కుకోకుండా రసానుభూతి ద్వారా జ్ఞాన సిద్ధిని పొందగలుగుతాడు.

శాంతికోసం పోరాటం విరమించాలి. పవిత్రత కోసం క్రోధం విడవాలి. ప్రేమకోసం ద్వేషం తొలగించుకోవాలి. ఆత్మత్యాగం కోసం స్వప్రయోజనాన్ని వదలుకోవాలి. మంచికోసం చెడును జయించాలి. ఆత్మచేత ఆత్మోపలబ్ధిని సిద్ధించుకో గలగాలి. - జేమ్స్ ఎలెన్

# కైవల్యోపనిషత్

(గత సంచిక తరువాయి) - రేఖ

బ్రహ్మము గురించే ఇంకా చెబుతూ శ్రీ మాతాజీ ఉపనిషత్తులోని 17వ మంత్రాన్ని వివరించారు. జాగ్రత్స్వప్నసుషుప్తులతో కూడిన ప్రపంచమును ఏదైతే భాసింపజేస్తున్నదో ఆ బ్రహ్మమే నేను అని తెలుసుకుంటే అతను సర్వ బంధముల నుండి విముక్తుడవుతాడు. ఈ మంత్రార్థము స్వయంబోధకంగా వున్నది. ఆత్మను గురించి చెబుతోంది. ఆ ఆత్మయే, ఆ చైతన్యమే మూడు అవస్థలలోనూ కలిగే అనుభవాలను తెలుసుకుని, వాటిని ప్రకాశింప జేసే జ్ఞానతత్వం. జాగ్రదావస్థ, స్వప్నావస్థ, సుషుప్తి అవస్థ అని వేరువేరుగా వున్నా మూడు అవస్థలలోనూ సాక్షిగా వున్నది ఆత్మే అయినా జీవభావాన్ని ఆపాదించుకుని విశ్వుడు, తైజసుడు, ప్రాజ్ఞుడు అని ఈ ఆత్మ విషయ ప్రపంచంలో ప్రవర్తిస్తూ భావిస్తుంటుంది. జాగ్రత స్వప్నం కాదు, స్వప్నం సుషుప్తి కాదు, సుషుప్తి జాగ్రత కాదు. ఒక అవస్థలో వున్న అనుభవం ఇంకొక అవస్థలో వుండదు. మూడు అవస్థలు విడిగా వున్నా వాటిలో అనుభవించేవాడు తానొక్కడే. ఇదే విషయాన్ని మనీషా పంచకంలో శ్రీ శంకరభగవత్పాదులవారు ఇంకా లోతుగా చెప్పారు. ఏమని?

**జాగ్రత్స్వప్న సుషుప్తిషు స్ఫుటతరా యాసంవిదుజ్జృంభతే**
**యా బ్రహ్మాది పిపీలికాన్త తనుషు ప్రోతా జగత్సాక్షిణీ**
**సైవాహం నచ దృశ్యవస్త్వితి దృఢ ప్రజ్ఞాపి యస్యాస్తిచేత్**
**చండాలోస్తు సతుద్విజోస్తు గురురిత్యేషా మనీషా మమ ॥**

అని శ్రీ మాతాజీవారు ఆ మంత్రాన్ని చదివి ఇలా వ్యాఖ్యానించారు....

మనం ఈ ఆత్మను గురించి ప్రబోధించే విషయంలో ఒకటి ముఖ్యంగా గుర్తుపెట్టుకోవలసిన విషయం ఏమిటంటే, దేవతలు ఎవ్వరూ రారు ప్రసక్తిలోకి. గురువుగారు ఒక్కరే వస్తారు. బాగా లోతైన విషయం చర్చించుకునేటప్పుడు గురువు ఒక్కరే ఎందుకు వస్తారు మధ్యలో అంటే, **ఈశ్వరో గురురాత్మేతి మూర్తిభేద విభాగినే** అన్న విషయాన్ని మనం గుర్తించాలి. పరబ్రహ్మ, చైతన్యం, ఆత్మ ఇవన్నీ పర్యాయపదాలు. ఆ స్థానం ఏదైతే వున్నదో గురువు కూడా అదే స్థానంలో వున్నారు. గురువు

(గురుతత్వం) సర్వసాక్షిగా ప్రకాశించేవారు, అన్నింటినీ ప్రకాశింపజేసేవారు. బాహ్య ప్రపంచపరంగా చూస్తే ఈ విషయం అర్థం కావడం కష్టం. ఎందుకంటే మానసిక సంబంధాలతో కూడిన ఈ జీవితంలో ఎన్నో ప్రమాదాలు, పరీక్షలు రావచ్చు. వాటిని ఎదుర్కొనేలా చేయగలిగే శక్తి గురువు వద్ద వున్నది. అయితే గురుగీతలో చెప్పినట్లు, **గురోరాజ్ఞాం ప్రకుర్వీత, గురోరన్యం న భావయేత్** అంటే గురువు చెప్పినట్లు చేస్తే, ఆత్మానుభవాన్ని పొందగలుగుతాము. మామూలు ప్రపంచంలో తల్లిదండ్రులు అంటారు - వాళ్ళు చెప్పినట్లు చేస్తేనే లౌకిక ఆస్తిపాస్తులవీ ఇస్తాము అని. వినకపోతే నీ అవస్థలు నీవే పడు అని ఆస్తి ఇవ్వరే. మామూలు ఖర్చు అయిపోయే ఆస్తి దగ్గరే తల్లిదండ్రులు అంత ఖచ్చితంగా వుంటే, మరి బ్రహ్మ విద్య దగ్గర గురువులు ఇంకా ఎంత ఖచ్చితంగా వుంటారు! అది కూడా మన మంచికోరి సాధనలో ఎలా నడుచుకుంటే బాగుంటుంది, ఏ విధంగా చేస్తే బాగుంటుంది అని మన శ్రేయస్సు కోరేవారు గురుదేవులే! గురువు కంటే భిన్నంగా ఇంకొకటి లేదు - **గురోరన్యం న భావయేత్**. నిత్యం గురుస్మరణలో వుండాలి. రూపనామాలతో ఆ పరబ్రహ్మ గురు రూపంలో వస్తే అపార్థం చేసుకోకూడదు. అలా రాకపోతే మనకి గుర్తించే జ్ఞానం లేదు.

పైన చెప్పిన మనీషాపంచకం మొదటి మంత్రంలో శ్రీశంకర భగవత్పాదులవారు ఏం చెబుతున్నారంటే, ఏది జాగ్రత్, స్వప్న, సుషుప్తి అవస్థల యందు స్ఫుటంగా, బాగుగా వ్యాపించి ప్రకాశిస్తుందో, ఏది పిపీలికాది బ్రహ్మ పర్యంతం ఈ శరీరాలన్నింటిలో వస్త్రంలో దారాలు పడుగు పేకల లాగా అల్లుకుపోయినట్లు వ్యాపించినదో, ఏ బ్రహ్మ వస్తువు సర్వజగత్తుకు సాక్షియై ప్రకాశిస్తోందో, అదే నేను (**సయేవ అహం - సైవాహం**) అంతేకానీ, కనిపించే దృశ్య ప్రపంచం నేను కాదు అనే దృఢ ప్రజ్ఞ ఎవరి యందైతే వుందో అతడు చండాలుడైనా, ద్విజుడైనా (బ్రాహ్మణుడైనా) నాకు గురువే అని నా బుద్ధి చెబుతోంది.

- సశేషం

# శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమంలో కార్యక్రమాలు

**జూన్ 2021**

4 శుక్ర - శ్రీ గురుదశమి, హనుమజ్జయంతి- సత్సంగం శ్రీసద్గురు పాదపూజ

8 మంగళ - మాస శివరాత్రి. జూన్ 8నుండి 12వరకు పావులూరు శాఖ వార్షిక సత్సంగ సమావేశములు. 12న శ్రీ అవధూతేంద్ర సరస్వతీ స్వామివారి ఆరాధన. 13న మంగళహారతి.

10 గురు - అమావాస్య

19 శని - జ్యేష్ఠ శుద్ధ నవమి - శ్రీ సుగుణప్రసాద మాతాజీవారి చతుర్దశ వార్షికారాధన, సత్సంగం.

24 గురు - జ్యేష్ఠ పూర్ణిమ - శ్రీసద్గురు పాదపూజ

**జులై 2021**

4 ఆది - శ్రీగురుదశమి - సత్సంగం, శ్రీ సద్గురుపాదపూజ

8 గురు - మాస శివరాత్రి

9 శుక్ర - అమావాస్య

16 శుక్ర - దక్షిణాయన పుణ్యకాలం ప్రారంభం.

20 మంగళ - తొలి ఏకాదశి - ఏకాహం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన

24 శని - ఆషాఢ పూర్ణిమ - గురుపూర్ణిమ - సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ, భక్తసమారాధన.

కరోనా వ్యాధి విలయతాండవం ఎంతోమందిని బలి తీసుకుంటోంది. అందులో మన తోటి భక్తులూ లేకపోలేదు. రోజు రోజుకూ పెరిగి పోతున్న ఈ వ్యాధి ఉపశమనం కోసం శ్రీగురుదేవుల అనుగ్రహం పొందటానికి శ్రీకాళీవనాశ్రమంలో ఈ క్రింది కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి.

21-4-21 శ్రీరామ నవమి నుండి 16 రోజులు హనుమత్ చరిత్ర ప్రవచనం. 12-5-21 నుండి ఉదయం ప్రార్థన అనంతరం బాల భక్తులచేత నగర సంకీర్తన, అనంతరం శ్రీమాతాజీవారి నివాసంలో ఉపనిషత్తులు, శ్రీబాబు దివ్యచరిత్ర రెండవ భాగం పారాయణ, సాయంత్రం 4-5 గం.ల వరకు ఆశ్రిత ఆశ్రయంలో విష్ణుసహస్రనామ పారాయణ జరుగుతున్నాయి. 14-5-21 నుండి 11 రోజులు ఉదయం 10-11గం.ల వరకు బృందావనంలో శ్రీ బాబు దివ్య చరిత్ర మొదటి భాగం సామూహిక పారాయణ జరిగింది.

# శ్రీబాబు దివ్యవాణి

సేకరణ - డా॥ రాఘవేంద్ర పరుచూరి.

14-12-1979న శ్రీబాబు బోధ

అహంకార మమకారములతోనే కదా యీ బంధన ఏర్పడింది మనకు. ఉదాహరణకు, ఈ దేహంతో కూడిన బంధువర్గం, మన చుట్టాలు, కొడుకు, తల్లి, తండ్రి మనకు యీకంటికి కనిపించే ప్రతిమానవుడు అందరూ ఒకలాగానే వున్నారు. కాని మన తండ్రి, కొడుకు, చెల్లెళ్ళు ఎక్కడో దూరంగా (వేరే వూరిలోవుంటూ, వారికేదో ఆర్యోగం బాగుండలేదని తెలిసి) మనమిక్కడ బెంగతో కృశించి చావడానికి సిద్ధమౌతున్నాము.

మరి మన చుట్టూవున్న మానవులు కూడ అలాగే వున్నారు కదా, మన యింటిప్రక్క వాళ్ళకు జబ్బుచేసినా కూడా చూసి వూరుకుంటున్నాము ఎందుకు? ఆ బంధువుల మీద ప్రేమ ఎలా వచ్చింది? ఈ దేహంతో సంబంధించిన వాళ్ళు అంటే అంతప్రేమతో వున్నామే. ఇక ఈ ఆత్మకు దేహం ఎంతోదగ్గర కదా, అందుకనే 'దేహం నేను' అనే దానిలో కూరుకుపోయాం. దీనినుండి బయట పడాలంటే అసలైన వస్తువును ఎరుక కలిగి వుండాలి అన్నమాట.

ఇంతేకాదు అద్దెయిల్లును, సొంతయిల్లును కూడ మనం ఎంతో భేదాభిప్రాయంతో చూస్తుంటాము కదా? అంతా ఈ దేహం నేను అనే దానిలోనే బంధింపబడి పోతున్నాము. యోగవాశిష్టంలో ఏమి చెప్పబడివుంది? జ్ఞాని అయినవాడు ఈ దేహమును ఒక తోలుతిత్తి వలె చూస్తాడని వుంది. ఉదాహరణకు మనం ఒకతోలు సంచిలో సరుకులు అవి తెచ్చుకుంటాము. ఆ సంచికి చిల్లుపడితే అయ్యో నా రెండురూపాయల సంచి పోయిందనుకుంటామే కాని మనమేమైనా బాధ పడతామా?

అలాగే, జ్ఞాని అయినవాడు ఈ దేహం ఒకతోలుతిత్తి , ఏదో ప్రపంచంలో కార్యం చేయవలసి దేహధారణ చేయవలసి వచ్చింది అంతేకాని దేహం నేనెందుకు అవుతాను అని దేహానికి విలక్షణంగా వుంటాడు. ఒకడికి తన పుత్రులన్నా, బంధువులన్నా చాలా మమకారం. వాళ్ళు కొడుతున్నప్పటికి వాళ్ళను అంటిపెట్టుకునే వుండేవాడు. అతనికి

కాలం తీరిపోయింది. అప్పుడు కొడుతున్న కొడుకులు కూతుళ్ళు అందరూ శవంమీద పడి ఏడుస్తున్నారు. కాని అంతప్రేమ చూపిన ఆ తండ్రికి తెలియదుకదా? అది జడం అయిపోయింది. చైతన్యం కాస్తా తప్పుకుంది. అంటే ఈ దేహంకంటే వేరేది లోపలనుండి తప్పుకుందని తెలుస్తుందికదా? ఇప్పుడు దేహానికి ఆత్మ విలక్షణంగా వున్నది అనేది బాగా తెలిసింది. జ్ఞాని అయినవాడు ఆ ఆత్మే తాను, కానీ ఈ దేహం తాను కాదనే దృష్టిలో వుంటాడు.

సాధకుడికి కావలసినది సాధనచతుష్టయ సంపత్తి. సాధన చతుష్టయం అంటే, నిత్యాఽనిత్య వస్తువివేకము, ఇహాముత్రార్థ ఫలభోగ విరాగము, శమాదిషట్కసంపత్తి మరియు ముముక్షత్వము.

నిత్యాఽనిత్య వస్తువివేకము అంటే ఏది నిత్యము ఏది అనిత్యము అనే వివేకము కలిగివుండటం. అంటే ఏది ఎప్పటికీ నశించని వస్తువు? ఏది ఎప్పటికైన నశించే వస్తువు? పరమాత్మ వస్తువు నిత్యము, ప్రపంచ విషయాదులు అనిత్యము అంటే ఎప్పటికైనా నశించేవే. పాలు, నీరు కలిపి పెడితే హంస స్వచ్ఛమైన తెల్లని పాలను త్రాగి నీటిని వదలి పెడుతుంది. అలాగే నిత్యమైన పరమాత్మను పట్టుకొని అనిత్యమైన ప్రపంచము, విషయాదులను వదిలిపెట్టాలి.

ఇహాఽముత్రార్థ ఫలభోగ విరాగము అంటే ఈ లోకమందు పరలోకమందు స్వర్గాది సుఖఫల అనుభవాలను వైరాగ్యం చేత త్యాగం చేయడం అంటే వాటియందు ఆసక్తి లేకుండా వుండటమే. మనం తిన్న అన్నంకాని, ఎదైనా మధురపదార్థం కాని వాంతి అయితే దానిని మనం తిరిగి తినలేము కదా? దానియందు అసహ్యం కలుగుతుంది. అలాగే యీ విషయాదులందు, భోగభాగ్యములందు వైరాగ్యం కలిగి వుండాలి. అలా వున్నవానికి కామక్రోధాది గుణములన్నియు హరించిపోయి వానికి శమదమాది షట్క సంపత్తి కలుగుతుంది.

-సశేషం

# హరరాయ్

- మురళి

1630 జనవరి 16న పంజాబ్ రాష్ట్రంలోని రోపార్ జిల్లా కిరత్‌పూర్‌లో జన్మించారు హరరాయ్. వీరు బాబా గురుదత్త కుమారుడు, శిక్కుల 6వ గురువు శ్రీ గురు హరగోవింద్ సింగ్‌జీ మనుమడు. హరరాయ్ చిన్నప్పటి నుండి దయార్ద్ర హృదయుడు. ఒక పర్యాయము గుఱ్ఱపు స్వారీ పూర్తి చేసుకుని తిరిగి వస్తున్న సమయంలో తాతగారు శ్రీ గురు హర గోవిందుడు పూదోటలో కూర్చుని వుండటం చూసి వారికి నమస్కరించడానికి ఒక్క ఉదుటున గుఱ్ఱం దిగి వారివైపు వెళ్ళే ప్రయత్నంలో కండువా ఒక పొదకు తగులుకుని కొన్ని పువ్వులు రాలిపోయాయి. అది గమనించిన హరరాయ్ అమితమైన దుఃఖం కలిగి, అక్కడే కూర్చుని ఏడవడం మొదలు పెట్టేసరికి హరగోవిందులు వెళ్ళి ఓదార్చవలసి వచ్చింది. అప్పుడు హరగోవిందులు 'వస్త్రాలను జాగ్రత్తగా ధరించాలి. నడిచేటప్పుడు ప్రక్కన వున్న వాటికి హాని కలుగకుండా చూసుకోవాలి. భగవంతుని సేవకులు సదా సర్వ ప్రాణుల యందు దయ కలిగి వుండాలి' అని బోధించారు.

శ్రీ హరరాయ్‌లోని సహజమైన ఆధ్యాత్మికతను గుర్తించిన శ్రీగురు హర గోవిందులు శ్రీ హరరాయ్‌ని తన ఆధ్యాత్మిక వారసునిగా ఏడవ సిక్కు గురువుగా ప్రకటించి 1644 మార్చి 3న మహాసమాధి చెందారు. శ్రీగురు హరరాయ్ గురునానక్ బోధలను, సిక్కు మతాన్ని ప్రచారం చేయడం కోసం ప్రచారకులను నియమించి, తూర్పు భారతదేశానికి, రాజస్థాన్, ఢాకా, మాల్వ ప్రాంతాలకు పంపించారు. శ్రీగురు హరరాయ్ స్వయంగా తాము కూడా పర్యటించి, తమ పూర్వ గురువుల బోధలను, సిద్ధాంతాలను ప్రచారం చేశారు. వీరి బోధలు బహుళ జనాదరణను పొందాయి. కిరత్‌పూర్‌నే తమ ప్రధాన కేంద్రంగా చేసుకున్నారు. భక్తులు, సందర్శకులు  అక్కడే వారి దర్శనం చేసుకుని ఆశీస్సులు పొందేవారు. వీరి కాలంలో లంగర్ (జాతి వివక్షతలేని భోజన వితరణ) దినదినాభివృద్ధి చెందింది. శ్రీగురు హరరాయ్ తనకంటే పూర్వ గురువుల ఉపదేశాలను తరచుగా భక్తులకు బోధిస్తుండేవారు.

"నిజమైన శిక్కు సూర్యోదయానికి పూర్వమే మేలుకొని, భగవంతుని తలుస్తూ పవిత్ర స్నానం ఆచరించి, దాన ధర్మాలు చేస్తాడు. ఇతరులతో అణకువగా మాట్లాడుతూ, అణకువగా ప్రవర్తిస్తూ అందరూ బాగుండాలని కోరుకుంటాడు. మితాహారము, మితభాషణ, మితనిద్ర ఆచరిస్తూ గురువు అనుగ్రహాన్ని పొందుతాడు. తన స్వశక్తిపైనే జీవిస్తాడు. ఎంతటి గొప్పవారైనా అహంకారాన్ని వీడి ఇతర భక్తులతో కూడి సంకీర్తన రాత్రింబవళ్ళు చేయాలి. గురు సాన్నిధ్యంలో ప్రశాంతతను, దివ్యమైన అనుభూతులను పొందాలి."

శ్రీగురు హరరాయ్ తన చిన్న కుమారుడైన హరకిషన్‌ను తన వారసునిగా శిక్కు సాంప్రదాయంలో 8వ గురువుగా నియమించారు.

## హైదరాబాదు శాఖలో కార్యక్రమాలు

**జూన్ 2021**

4 శుక్ర - శ్రీగురుదశమి, శ్రీ హనుమజ్జయంతి -సా॥5-30గం. సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ, భక్తసమారాధన.

24 గురు - జ్యేష్ఠ పూర్ణిమ - సా॥5-30గం. సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ, భక్తసమారాధన

**జులై 2021**

4 ఆది - శ్రీగురుదశమి - ఉదయం 11గం. శ్రీసద్గురుపాదపూజ, సత్సంగం, భక్తసమారాధన.

20 మంగళ - తొలిఏకాదశి - సా॥5-30గం. సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ, భక్తసమారాధన

24 శని - (ఆషాఢ) గురు పూర్ణిమ - సా॥5-30గం. సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ, భక్తసమారాధన

# సమర్థ సద్గురు నాధుని దివ్య చరిత్ర

## శ్రీహరిరావు గారితో శ్రీబాబు

- కీ.శే. విజయేశ్వరానంద ప్రసాద్

24-10-1965: దీపావళికి శ్రీ బాబు భీమవరంలో ఉన్నారు.

6-11-1965: శ్రీశైలం యాత్ర వరుసగా నాలుగేళ్ళు జరిగాక, యిది అయిదవ సారి యాత్ర. అందరు భక్తులను ఆహ్వానించి తీసుకుని వెళ్ళారు శ్రీ బాబు.

8-11-1965: సోమవారం ఈ రోజు కార్తీక పూర్ణిమ. మల్లికార్జున స్వామికి సహస్ర ఘటాభిషేకము.

9-11-1965: మంగళవారం శ్రీ భ్రమరాంబా దేవికి లక్ష కుంకుమార్చన.



10-11-1965: స్వామికి లక్ష బిల్వార్చన. పూజ అనంతరం శ్రీ బాబు అందరికీ తీర్థం ఇచ్చారు. కవిగారు ఆ దృశ్యం వర్ణిస్తూ...

**అమృతము పంచియిచ్చితి వాయుగమున**
**అమరులకు జగన్మోహినివై ప్రసాదు!**
**పంచుచున్నాడ వీనాడు భక్తతతికి**
**జ్ఞానతీర్థము శివ సన్నిధానమందు.**
**చావులేకుండ మాత్రమే సలుప జాలు**
**నమృత తీర్థంబు। జ్ఞాన తీర్థమిక ముందు**
**జన్మమే లేక యుండగా సలుప జాలు।**
**సత్యమోహన కాళీప్రసాద బాబు!**

అని వ్రాశారు.

11-11-1965: పాతాళ గంగ స్నానానికి భక్తులతో వెళ్ళారు శ్రీ బాబు. ఆ రాత్రి తర్లుపాడు సత్రంలో జరిగిన సత్సంగ సమావేశానికి అధ్యక్షత వహించిన వారు తమ ప్రారంభోపన్యాసంలో మహాత్ములను విమర్శిస్తూ మాట్లాడారు. శ్రీ బాబు పచ్చకళ్ళద్దాలతో చూసిన వాడికీ పచ్చకామర్ల రోగికి ప్రతిదీ పచ్చగానే కనబడుతుంది" అని శ్రీ రామ కృష్ణ పరమహంస, వివేకానందుల గురించి బోధ చేశారు. మధ్యలో అధ్యక్షుడు ఏదో మాట్లాడే ప్రయత్నం చేసి చివరికి తమ తప్పిదం తెలుసుకుని శ్రీ బాబు పాదాలపై పడి క్షమించమని వేడుకున్నారు.

13-11-1965 : శ్రీశైలయాత్ర ముగించుకుని గుంటూరు చేరారు.
14-11-1965: ఆదివారం

సత్సంగ సమావేశంలో శ్రీబాబు "నీవు లేక వీణ" అనే పాట పాడమని, దానికి అర్థం చెప్పారు. శ్రీ బాబు "ఇదేమిటి? ఈ బాబుగారు సినిమా పాటలు పాడిస్తారు?" అని కొందరనుకుంటున్నారు. అది సినిమాలోదా, కాదా అనే విషయం అలా ఉంచి దాని అర్థం చూడండి. రాధ, కృష్ణుని యెడబాటు సహించలేక తల్లడిల్లిపోతూ, ప్రకృతిలోని అణువణువు తనవలె పరమాత్ముని పొందుకోసం తపిస్తూన్నట్లు, ఆ విరహంలో తన సహజ స్వభావాన్ని కూడా మరచి పరమాత్ముని తదేక ధ్యానంలోనే నిమగ్నమై పోతున్నట్లు భావిస్తున్నది. పరమాత్మ లేని ప్రకృతి ఎలా నిర్జీవమో, చైతన్యం లేని వస్తువు ఎలా జడమో అలాగే జీవశక్తిని కోల్పోయిన శరీరము శవమే.

ఒక పాట వింటున్నా, ఒక దృశ్యం చూస్తున్నా, కర్ణేంద్రియమూ, నేత్రేంద్రియము వాటిని మనస్సుకు అందిస్తాయి. మనస్సు శుద్ధ మనస్సు అయితే వాటి లోని పవిత్రతను గ్రహిస్తుంది, ఆనందిస్తుంది. మలిన మనస్సు అయితే అందులోని మలినాన్నే చూస్తూ, మలినాన్నే అంటించుకుంటుంది.

ఎదుట ఉన్న  సృష్టి భ్రాంతిమయమైనది. కాని ధర్మరాజుకు అందులో చెడు కనబడ లేదు. దుర్యోధనుడు అందులో మంచిని చూడలేక పోయాడు. దానికి కారణం ప్రపంచం కాదు, వాళ్ళ మనస్తత్త్వమే; వాళ్ళ దృష్టి భేదమే. కనుక మనం మంచిని గ్రహించ గలగాలంటే మన దృష్టిని మంచిగా మార్చుకోవలసిందే గాని, సృష్టిని మనం మార్చగలమా?"
13/14-1-1966 : భోగి, సంక్రాంతి ముంజవరపుకొట్టులో జరిగింది.
17-1-1966: ఆ రోజు సాయంత్రం రేడియోలో "పాండురంగ మహాత్మ్యం"లోని పాటలను విని శ్రీ బాబు చక్కని బోధను అందించారు. "పుండరీకుడు తన తల్లిదండ్రుల సేవలో ఉన్నపుడు పాండురంగడు వచ్చి పిలిస్తే "ప్రభూ! తమ సేవలోనే ఉన్నాను. ఇది ముగించుకుని వస్తాను"అన్నాడు. "నా భక్తుడు అతని తల్లిదండ్రులలో కూడా నన్నే దర్శించ గలుగుతున్నా"డని ఆనందపడిపోతూ, పాండురంగడు అక్కడ రెండు యిటుక రాళ్ళపై అప్పటికి యిప్పటికి అలాగే నిలబడిపోయి తన భక్త వాత్సల్యాన్ని చాటుకుంటున్నాడు. నిజమైన భక్తులకు భగవంతుని యెడల అట్టి స్వతంత్రత ఉంటుంది. అని చెప్పారు.

-సశేషం

(గత సంచిక తరువాయి) విష్ణు కథలు -రమణ ప్రసాద్

## బోధల బావా

మర్నాడు ఒక వర్తకుడు వెయ్యిమందికి సమారాధన చేయడానికి చంద్రభాగానదీ తీరాన పందిళ్ళువేసి ఘనంగా ఏర్పాట్లు చేశాడు. పండలీనాధుడు ఒక వృద్ధ బ్రాహ్మణ రూపంలో జీర్ణ వస్త్రాలతో వచ్చి, బోధలను "నువ్వు దూరంగా నించొని ఉండమ"ని నియమించి పందిట్లో ప్రవేశించి, "నాకు చాలా ఆకలిగావుంది అన్నము పెట్టమ"ని అడిగాడు. కార్యకర్తలు "నీకు ఇక్కడ అన్నం దొరకదు. సంకల్పించిన ప్రకారం లెక్కకు సరిగా బ్రాహ్మణులందరూ ముందే వచ్చి ఉన్నారు" అనగా "వేయిమంది బ్రాహ్మణులు భుజించుచుండగా నావంటి వృద్ధునకు అన్నం పెట్టడం కష్టమా, నేను నడువజాలకున్నాను, మూర్ఛవస్తోంది" అని



చెప్పి అక్కడ కూర్చుండి పోయాడు. వర్తకుడికి కోపం వచ్చింది. "వీడికి చోటిస్తే అనేకమంది ముసలి వాళ్ళు వచ్చి బాధిస్తారు, వీడిని ఈడ్చుకుపోయి పందిరి బయట వదిలిరండి" అని సేవకులకు చెప్పగా ఆ సేవకులు అతనిని బయట వదలి పెట్టారు. పందిట్లో బ్రాహ్మణులు అవపోశనం చేసే సమయానికి ఒక సుడిగాలి వచ్చి పందిరి ఎగిరిపోయింది. భోజన పదార్ధాలపై ఇసుక పడింది. వారంతా లేచి భయంతో బయటకు పరుగెత్తుకు పోయారు. దీనిని భగవంతుడు బోధలకు చూపి "వీరి భావము మంచిదికాదు కనుకనే భావశుద్ధిగల నీవద్దకు వచ్చాను. నీ ఆతిధ్యంతో సకల లోకాలు తృప్తి చెందాయి" అన్నాడు. బోధల దేవదేవుని అనేక విధాల స్తుతించి భగవంతుని అనుమతిని పొంది తన ఊరికి తిరిగి వచ్చాడు.

మార్గమధ్యంలో బోధలకు ఆకలి వేసింది. సర్వాంతర్యామి అయిన పండరీనాధుడు అది తెలుసుకొని బోధల వచ్చే మార్గంలో ఒక ఫల వృక్షాలతో ఉన్న తోటను సృష్టించి పత్నీ సమేతంగా అచట వేచియున్నాడు. బోధల ఆనందంతో భగవంతుని కీర్తిస్తూ, ఆకలి బాధను లెక్కచేయకుండా తన దారిన పోతుంటే, రుక్మిణీదేవి వడినిండా మధుర ఫలాలు కట్టుకొని, ఒక గంపలో రొట్టెలతో బోధలకు ఎదురుగా వచ్చి "నీవు పండరీపురంనుంచి వస్తున్నావు. నిన్ను ఆదరించటానికి నేను నాభర్త నీ కొరకు ఫలాలను, రొట్టెలను జాగ్రత్త చేసి నీకొరకు వేచి వున్నాము. నువ్వు ఈ తోటలోకి వచ్చి నీ క్షుద్బాధను తీర్చుకొని కొంతసేపు విశ్రాంతి తీసుకు వెళ్ళు అని పలుకగా, బోధల తోటలోకి ప్రవేశించి ఒక చెట్టు క్రింద కూర్చుని ఆ దంపతులు ఇచ్చిన ఫలాలను, రొట్టెలను, మంచినీటిని స్వీకరించాడు. ఇంతలో ఆ దంపతులు అదృశ్యమైనారు. ఆ తోటకూడా అదృశ్యమైంది. బోధల ఆశ్చర్యపడి "ఆహా ఏమి భగవంతుని లీల!" అనుకుని ముందుకు సాగాడు.

ఒకనాడు బోధల కాపలాకాస్తూ ధ్యానమగ్నుడైనాడు. అప్పుడు పక్షులు వచ్చి జొన్నకంకులను ఇష్టానుసారంగా తింటున్నాయి. దీనులైన బాటసారులకు జొన్న కంకులను విరచి ఇస్తున్నాడు. ఇంతలో అతని భార్య మమతాబాయి భర్తకు ఆహారం తెచ్చి భుజింపజేసి "నాధా! మీరిట్లా జొన్న కంకులను బాటసారులకు ఇస్తూవుంటే మనం పన్ను ఎలా కడతాము? మనమేంతింటాం? ఇక మీదట మీరు కంకులను ఎవ్వరికీ ఇవ్వవద్దు. పాండురంగని మీద ఆన" అని చెప్పి ఇంటికి వెళ్ళింది.

-సశేషం

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - PALURI SIVA RAMA KALI PRASAD